పల్లె రోడ్లను విస్మరించిన వైసీపీ సర్కార్

యాడికి మండలంలోని మేకలపల్లి రోడ్డు (ఫైల్)



సగం పనులు ఇప్పటికీ పెండింగ్‌లోనే

బిల్లులు కాక ఆపేసిన కాంట్రాక్టర్లు

దృష్టి సారించిన కూటమి ప్రభుత్వం

5 ఏళ్లలో అధ్వానం !

అనంతపురం సిటీ, సెప్టెంబరు 16: గడచిన ఐదేళ్లలో రోడ్ల అభివృద్ధి గురించి వైసీపీ ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. దీంతో ముఖ్యంగా గ్రామీణ రహదారులు పూర్తిగా ఛిద్రమైపోయాయి. జిల్లాలో పీఐయూ (ప్రాజెక్ట్ ఇంప్లిమెంటేషన్ యూనిట్స్) పరిధిలో 2018-19లో ఏఐఐబీ (ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్‌వెస్ట్ బ్యాంక్) కింద మంజూరైన రోడ్ల పట్ల కూడా వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి ప్రదర్శించింది. ఏఐఐబీ 138 రోడ్డు పనులకు రూ. 268 కోట్లు మంజూరు చేసింది. ఇందులో ఇప్పటికి 35 రోడ్లు పూర్తి కాగా 35 రోడ్ల పనులు నత్తనడకన సాగుతున్నాయి. మిగిలిన 65 రోడ్లు ప్రారంభానికే నోచుకోలేదని అధికారవర్గాలు చెబుతున్నాయి.

ప్రస్తుత కూటమి ప్రభుత్వమైనా ఈ పనులపై ప్రత్యేక దృష్టి సారించి గ్రామీణుల రహదారి కష్టాలను తీర్చాలని పలువురు కోరుతున్నారు. జిల్లా పంచాయతీ రాజ్‌శాఖ పరిధిలోని పీఐయూ కింద ఏఐఐబీ 2018-19లో 138 రోడ్డు పనులకు రూ. 268 కోట్లు మంజూరు చేసింది. అయితే అవి టీడీపీ పాలనలో మంజూరైనవి కదా మనమెందుకు చేయడం అని గత వైసీపీ సర్కార్ ఈ రోడ్ల పనుల పట్ల తీవ్ర నిర్లక్ష్యం చూపింది. దీంతో గుంతల రోడ్లపైనే ప్రజలు ప్రయాణం చేసి ప్రమాదాల బారిన పడిన సందర్భాలు కూడా ఉన్నాయి.

జిల్లాలో పీఐయూ పరిధిలో మంజూరైన రోడ్ల పరిస్థితి ఇలా..

2018-19లో మంజరైన రోడ్ల సంఖ్య	: 138
ఏఐఐబీ కింద వెచ్చించిన వ్యయం	: రూ. 268కోట్లు
పూర్తయిన రోడ్ల సంఖ్య	: 35
ఇప్పటికి కొనసాగుతున్న రోడ్లు	: 35
పెండింగ్ బిల్లులు	: రూ. 23.66 కోట్లు
ఇప్పటికీ ప్రారంభానికి నోచుకోని రోడ్లు	: 65
రద్దయిన రోడ్లు	: 03

బిల్లులు రాక.. పనులు ఆపేసిన కాంట్రాక్టర్లు..

ఏఐఐబీ కింద మంజూరైన రోడ్డు పనులు చేసిన కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు మంజూరు చేయలేదు. దీంతో పనులు ఆశించిన స్థాయిలో జరగలేదు. ప్రధానంగా రాప్తాడు, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో సుమారు 52 రోడ్లు ప్రారంభానికి నోచుకోలేదు. మిగిలిన 13 రోడ్లు శింగనమల, గుంతకల్లు, తాడిపత్రి, రాయదుర్గం, అనంతపురం నియోజకవర్గాల్లో ఆగిపోయాయి. గత ఐదేళ్లలో చేసిన 70 పనుల పరంగా.. ఇప్పటికి రూ.23.66 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో పనులు చేసిన కాంట్రాక్టర్లు బిల్లుల కోసం నిరీక్షిస్తున్నారు. బిల్లులు వస్తే తప్ప.. పనులు చేసే ప్రసక్తి లేదంటూ కొందరు కాంట్రాక్టర్లు పనులను మధ్యలోనే ఆపేశారు. కాగా గత వైసీపీ సర్కార్ నిర్లక్ష్యం కారణంగా ఆగిపోయిన 65 రోడ్ల పనులపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించినట్లు సమాచారం. ఈ రోడ్లతో పాటు మరిన్ని రోడ్లను కలిపి వివిధ నిధుల ద్వారా పనులు చేసేలా ప్రణాళిక సిద్ధం చేస్తోందని సమాచారం. పెండింగ్ బిల్లులను కూడా చెల్లించడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది.



పాడైపోయిన ఉరవకొండ - ఇంద్రావతి రోడ్డు

ప్రభుత్వం ఆరా తీసింది



ఏఐఐబీ రోడ్ల పనుల పురోగతితో పాటు పెండింగ్ బిల్లులపై ప్రభుత్వం ఇటీవల ఆరా తీసింది. వీటితో పాటు ఇంకా ప్రారంభం కాని పనులపై కూడా సమగ్ర నివేదిక అందించమని కోరింది. ఆ మేరకు ప్రభుత్వానికి నివేదిక పంపాం. ఇతర నిధులతో ఇంకా ప్రారంభం కాని పనులు చేయడానికి ప్రభుత్వం యోచిస్తోంది.

- కేవీకేవీ ప్రసాద్, ఎస్ఈ, పంచాయతీ రాజ్‌శాఖ

రైతన్నకు తప్పని తిప్పలు

- ఈ క్రాప్ బుకింగ్, ఈకేవైసీ ఆలస్యం
- జాయింట్ ఎల్పీ నంబర్లతోనే సమస్య
- కార్యాలయాల చుట్టూ అన్నదాతల ప్రదక్షిణ



సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ కార్యాలయం వద్ద రైతులు

బొమ్మనహాళ్, సెప్టెంబరు 16: మండలంలో ఈ క్రాప్ బుకింగ్, ఈకేవైసీ కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు మాత్రం ఈ-క్రాప్ బుకింగ్ వంద శాతం పూర్తయిందని చెబుతున్నారు. అయితే జాయింట్ ఎల్పీ నంబర్లు రెవెన్యూ, వ్యవసాయాధికారుల వద్ద వేర్వేరుగా ఉన్నాయి. వీటి పరిష్కారం కోసం రైతులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. కొందరు రెవెన్యూ అధికారుల అలసత్వం వల్ల రైతులు ప్రభుత్వ పథకాలకు దూరం అయ్యే పరిస్థితి కనిపిస్తోంది. గత వైసీపీ పాలనలో నలుగురు, ఐదుగురు రైతులకు కలిపి ఎల్పీ నంబర్లు కేటాయించారు. మండలంలో ఆరు రెవెన్యూ గ్రామాలలో రీసర్వే జరిగింది. అయితే కొందరికి ఎల్పీ నంబర్ల సమస్య ఏర్పడింది. వ్యవసాయ శాఖ అధికారులు 1460 జాయింట్ ఎల్పీ నంబర్లను ఈ క్రాప్ బుకింగ్ చేశామని చెబుతున్నారు. అయితే 1135 మాత్రమే జాయింట్ ఎల్పీ నంబర్లు ఉన్నాయని సర్వేయర్ అంటున్నారు. ఈ ఎల్పీ నంబర్ల సమస్య కారణంగా పంట నమోదు, ఈ-కేవైసీ కావడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. లాగిన్ ద్వారా సమస్యను పరిష్కరించేందుకు వీలున్నా కొందరు వీఆర్వోలు పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 25వేల ఎకరాలకుపైగా వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారు. జాయింట్ ఎల్పీ నంబర్లు 1460 ఉండగా ఖాతా నంబర్లు 4632 ఉన్నాయి. అయితే జాయింట్ ఎల్పీ నంబర్లు ఉన్న రైతుల సమస్యలను పరిష్కరించి వందశాతం ఈ-క్రాపింగ్ పూర్తి చేశామని అధికారులు అంటున్నారు. కానీ రైతులు జాయింట్ ఎల్పీ నంబర్ల సమస్యతో కార్యాలయాల చుట్టూ తిరుగుతునే ఉన్నారు.

సమస్యను పరిష్కరిస్తున్నాం



జాయింట్ ఎల్పీ నంబర్ల సమస్య కారణంగా క్రాప్ బుకింగ్ నమోదు కాని పరిస్థితుల్లో ఆ రైతుల సమస్యలను ఎప్పటికపుడు పరిష్కరిస్తున్నాం. మా దృష్టికి వచ్చినవి ఆలస్యం చేయడం లేదు. వీఆర్వోలకు కూడా ఆదేశాలు జారీ చేశాం. ఈ-క్రాప్ బుకింగ్‌కు సంబంధించిన వాటిని ఆలస్యం చేయకుండా ఎప్పటికపుడు పరిష్కరించాలని ఆదేశించాం. ఎవరికైనా ఈ పంట నమోదు కాలేని పరిస్థితిలో ఉంటే మా దృష్టికి తీసుకురావాలి.

- మునివేలు, తహసీల్దార్

ఈ-క్రాప్ బుకింగ్ ఇలా..

సాధారణంగా వ్యవసాయాధికారులు రైతు పొలం వద్దకు వెళ్లి ఈ- పంట నమోదు చేయాలి. అప్పుడు రైతుల రిజిస్టర్డ్ మొబైల్‌కు సమాచారం వస్తుంది. అందులో నమోదు చేసిన అంశాల ప్రకారం ప్రక్రియ పూర్తయినట్లుగా భావించాలి. ఇదంతా పూర్తయితే ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోతే రైతుకు పరిహారం లభిస్తుంది. ఎక్కడైనా సమస్య ఉంటే ఆ భూమి దగ్గరికి వీఆర్వో వెళ్లి ఏ రైతు పేరుతో ఉందో గుర్తించాలి. దీనికి సర్వేయర్ సర్వేనంబర్ సరిగ్గా ఉందో లేదో చెప్పాలి. ఆ భూమిలో వేసిన పంట వద్దే సంబంధిత రైతు ఫొటోను వ్యవసాయాధికారి తీసి ఈ క్రాప్ బుకింగ్ నమోదు చేయాల్సి ఉంటుంది. అయితే వీఆర్వోలు భూమి వద్దకు వెళ్లకుండానే రోడ్లపైనే ఫొటోలు తీసి అప్‌లోడ్ చేస్తున్నా రన్న విమర్శలు వస్తున్నాయి. దీంతో రికార్డు తప్పుగా నమోదైతే నష్టం జరిగినపుడు నష్టపరిహారం అందే అవకాశం ఉండదని రైతులు ఆవేదన చెందుతున్నారు. గత రీసర్వే తంటా వల్ల జాయింట్ ఎల్పీ నంబర్ల కారణంగా సమస్యలు ఎదురవుతున్నా యని రైతులు ఆందోళన చెందుతున్నారు.

వంద శాతం పూర్తి చేశాం



ఈ పంట నమోదు బొమ్మనహాళ్ మండలంలో వం దశా తం పూర్తి చేశాం. జాయింట్ ఎల్పీ నంబర్ల సమ స్యను పరిష్కరించాం. ఎక్కడో ఒకటి, రెండో ఉంటే అవి కూడా నమోదు చేసేస్తాం.

- సాయికుమార్, వ్యవసాయాధికారి

దిష్టి బొమ్మల్లా సామాన్లు

బడిలో పిల్లలకు తప్పని నీటి కట్టాలు

బళ్లో పిల్లోలకు మంచి నీళ్ల కోసరమని సామాన్లన్ని తెచ్చిపెట్రి. మడి ఇబ్బుడిదంకా దాన్లను వాడిందే లేదు. ఇంగ యావో ఒకటిలే అని పిల్లోల్లంతా మామూలుగా బళ్లోకి వచ్చే ఫ్లోరైడ్ నీళ్లనే తాగుతాండారు. ఇంకొందరు ఇంటికాడ నించి బాటిల్లో తెచ్చుకుంటాండారు. ఫ్లోరైడ్ నీళ్లు తాగితే పిల్లోళ్లకు రోగాలు వత్తాయని సుద్ది చేసుకుని తాగేదానికి అబ్బుటి వైసీపీ గవర్మెంటోళ్లు నాడు- నేడు కింద దుడ్లు కూడా ఇచ్చారంట. ఆ లెక్కతో బళ్లో పనులతో పాటు నీళ్లు సుద్ది చేసుకునేకి సామాన్లు కూడా తెచ్చారు. మడి ఇబ్బుడిదాకా వాటిని వాడుకోలేదు. కొన్నిసోట్ల వాడుకుందా మంటే అవి పనే సేయడం లేదంట. దీంతో అవి దిష్టిబొమ్మలాకట్ట అందరికి కనబడతాండాయి. మండలంలోని కమ్మూరు, కూడేరు, కొర్రకోడు ఐస్కూలు, కూడేరు, కమ్మూరు, కొర్రకోడు, నాగిరెడ్డిపల్లి, మరుట్ల ఎలిమెంట్రీ స్కూల్లో గత రెండు, మూడేళ్లుగా సామాన్లన్నీ వేస్ట్‌గా ఉన్నాయి.

- కూడేరు

కమ్మూరు పాఠశాలలో రిపేరీకి నోచుకోని నీటి శుద్ధి మిషన్



ఇబ్బంది పడుతున్నారు



మా ఊర్లో ఎలిమెంట్రీ స్కూలు, హైస్కూల్లో పిల్లోళ్లు తాగేకి మంచి నీళ్లు లేక ఇబ్బంది పడతాండారు. నాడు-నేడు దుడ్లతో బిగిచ్చిన సామాన్లు సరిగ్గా పని చేయ లేదు. మద్యానం బువ్వ తినేతబ్బుడు పిల్లోళ్లంతా శానా ఇబ్బంది పడతాండారు. గతిలేక ఫ్లోరైడ్ నీళ్లే తాగుతాండారు. ఆపీసర్లు దీన్ని పట్టించుకోని సామాన్లన్నీ రిపేరు చేయించి పిల్లోళ్ల బాదలు తీర్చల్ల.

- పల్లక్కి ఎర్రిస్వామి, చైర్మన్, కమ్మూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

సమాచారం పంపారు



పాఠశాలకు సరఫరా చేసిన నీటి శుద్ధి యంత్రాల రిపేరీ కోసం సంబంధిత పాఠశాలల హెచ్ఎంలు యాప్‌లో సమాచారం పంపారు. ఇటీవల పాఠశాలలకు వెళ్లిన సమయంలో ఈ విషయం నా దృష్టికి వచ్చింది. నేను ఉన్నతాధికారులకు సమాచారం పంపా. త్వరలోనే మెషీన్లు రిపేరి చేయించి విద్యార్థులకు శుద్ధి నీరు అందిస్తాం.

- సాయికృష్ణ, ఎంఈఓ-2



ఇంటి నుంచి నీటిని తెచ్చుకుని భోజనం తింటున్న విద్యార్థులు

ఆగ్రహించిన అన్నదాత

విద్యుత్ సరఫరాలో నిర్లక్ష్యం... సబ్‌స్టేషన్ ముట్టడి

అధికారులపై మండిపాటు

యాడికి, సెప్టెంబరు 16: వ్యవసాయానికి విద్యుత్ సరఫరాలో ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ నిట్టూరు, చిక్కేపల్లి గ్రామాల రైతులు సోమవారం నిట్టూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయానికి 9గంటల నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని ప్రభుత్వం చెబుతున్నా ఇక్కడి ట్రాన్స్‌కో అధికారులు అమలు చేయడం లేదన్నారు. స్థానిక అధికారులు వ్యవసాయానికి ఇష్టానుసారంగా కరెంట్ సరఫరా చేస్తున్నారని ఆరోపించారు. రాత్రి పూట, తెల్లవారుజామున విద్యుత్ సరఫరా చేస్తూ రైతులను ఇబ్బంది పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయానికి 7 గంటలే కరెంట్ సరఫరా చేస్తున్నారని, అది కూడా అంతరాయంతో సరఫరా చేస్తున్నారని మండిపడ్డారు. కరెంట్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియక పంటలు ఎండబెట్టుకోవాల్సి వస్తోందని తెలిపారు. విద్యుత్ సబ్‌స్టేషన్‌ను రైతులు ముట్టడించారని సమాచారం అందుకున్న పోలీసులు సబ్‌స్టేషన్ వద్దకు వెళ్లారు. రైతులకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. ట్రాన్స్‌కో ఏఈ వచ్చి వివరణ ఇచ్చేదాకా కదిలేది లేదని రైతులు తెలిపారు. సబ్‌స్టేషన్ వద్దకు ఏఈ రాజారావు వచ్చి రైతులకు సర్దిచెప్పారు. సబ్‌స్టేషన్‌లో చిన్నచిన్న మరమ్మతుల కారణంగా అంతరాయం కలుగుతోందని తెలిపారు. మరమ్మతులు పూర్తికాగానే అంతరాయం లేకుండా వ్యవసాయానికి కరెంట్ సరఫరా చేస్తామని తెలిపారు. వీలైనంత తొందరగా సమస్యను పరిష్కరించకపోతే ఆందోళన కార్యక్రమాలు మరింత ఉధృతంగా చేపడతామని ట్రాన్స్‌కో అధికారులను రైతులు హెచ్చరించారు.



ట్రాన్స్‌కో ఏఈ రాజారావుతో వాగ్వాదం చేస్తున్నరైతులు



డ్వామా కార్యాలయం

ఎట్టకేలకు రిలీవ్

డ్వామా పీడీ బాధ్యతల నుంచి తప్పుకున్న వేణుగోపాల్ రెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 16: ఎట్టకేలకు డ్వామా పీడీ వేణుగోపాల్ రెడ్డి రిలీవ్ అయ్యారు. ఈనెల 12న డ్వామా పీడీగా ఉన్న వేణుగోపాల్‌రెడ్డిని మాతృశాఖకు బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఈనెల 17 వరకు అవకాశం కల్పించాలని, ఆరోజు రిలీవ్ అవుతానని జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ నుంచి వేణుగోపాల్ రెడ్డి అనుమతి తీసుకున్నారు. అయితే ఆయనపైన సోషల్ మీడియాలో విపరీత మైన ఆరోపణలతో పోస్టులు పెట్టడంతో సోమవారం హుటా హుటిన రిలీవ్ అయ్యారు. వేణుగోపాల్‌రెడ్డికి ఘనంగా వీడ్కోలు పలకాలని కొందరు స్వామి భక్తులు యత్నించగా, ఆవిషయం బయటకు పొక్కడంతో వీడ్కోలు సభను రద్దు చేసినట్లు తెలిసింది. ఉద్యోగుల నుంచి సుమారు రూ.15లక్షల వరకు డబ్బులు వసూ లు చేసి పీడీకి బంగారు కడియం తొడగాలని యత్నించినట్లు సమాచారం. ఈ విషయాలన్నీ సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో వీడ్కోలు సభ నిర్వహించకూడదని భావించారు. రిలీ్ అయిన వెంటనే వేణుగోపాల్‌రెడ్డి విజయవాడకు బయలుదేరి వెళ్లినట్లు ఆశాఖలోని ఉద్యోగులు చెబుతున్నారు. అయితే ఇన్‌చార్జి బాధ్యతలు ఎవరికీ అప్పగించకపోవడం సర్వత్రా ఉత్కంఠగా మారింది. అందరూ ఏపీడీగా ఉన్న సుధాకర్‌రెడ్డికి డ్వామా ఇన్‌చార్జి పీడీగా బాధ్యతలు అప్పగిస్తారని చర్చించుకుంటున్నారు.

పోటీలో ఇద్దరు

డ్వామా పీడీ వేణుగోపాల్ రెడ్డి రిలీవ్ కావడంతో ఇన్‌చార్జి పీడీ పోస్టుకు ఇద్దరు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. డ్వామాలో ఉపాధి పథకం సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఎంపీడీఓ శైలజ, జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారిగా పనిచేస్తున్న రామాంజనేయులు ఇన్‌చార్జి బాధ్యతల కోసం ముమ్మర ప్రయత్నాల్లో నిమగ్నమ య్యారు. డ్వామా ఏపీడీగా ఉన్న సుధాకర్ రెడ్డికి కాకుండా ఇతరులకు ఇస్తారా...లేక ఆయనకే ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగి స్తారా అనేది కలెక్టర్ నిర్ణయంపై ఆధారపడి ఉంది.

నేటి నుంచి 'స్వచ్ఛతాహి సేవ'

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 16: జిల్లాలో మంగళవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం ప్రారంభం అవుతున్నట్లు డీపీఓ ప్రభాకర్ రావు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండల, పంచాయతీ కేంద్రాల్లో పారిశుధ్య కార్యక్రమాలు ప్రారంభం అవుతాయన్నారు. యాడికిలో ప్రారంభ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు డీపీఓ తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్‌తో పాటు, జడ్పీ సీఈఓ ఓబులమ్మ ముఖ్య అతిథులుగా హాజరవుతారని వెల్లడించారు. స్వచ్ఛభారత్‌లో భాగంగా 15 రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో క్షేత్రస్థాయి సిబ్బంది ఏమి చేయాలన్న అంశాలపై ఇప్పటికే దిశా నిర్దేశం చేసినట్లు వివరించారు. అందుకు అనుగుణంగా ప్రతి పంచాయతీలో నిబంధనల ప్రకారం ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

గడువులోపు బదిలీలు పూర్తి చేస్తాం: డీపీఓ

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు16: పంచాయతీ సిబ్బంది బదిలీల ప్రక్రియను ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు గడువులోపు పూర్తి చేస్తామని డీపీఓ ప్రభాకర్‌రావు పేర్కొన్నారు. పంచాయతీ సెక్రటరీ గ్రేడ్-5, గ్రేడ్-6 సంబంధించి కౌన్సెలింగ్‌కు హాజరయ్యేలా తేదీలు ఇస్తామన్నారు. మిగిలిన వారికి సంబంధించి ఇప్పటికే జాబితా సిద్ధం చేశామని, కలెక్టర్ ఆమోదం అయిన వెంటనే మరో రెండు రోజుల్లో జాబితాను ప్రకటిస్తామని తెలిపారు. ఇప్పటికే డీపీఓ కార్యాలయ క్లరికల్ సిబ్బంది బదిలీల ప్రక్రియ ముగించామని, వారిని రిలీవ్ కుడా చేసినట్లు వెల్లడించారు. పాతవారి స్థానాల్లో కొత్తవారు జాయిన్ అయ్యారన్నారు. ప్రధానంగా ఐదేళ్లు పూర్తయిన వారిని తప్పనిసరిగా బదిలీ చేసినట్లు పేర్కొన్నారు.

డబ్బుల్ నొక్కుడు..!

- రిటైర్డ్ వీఆర్ఓగా ప్రభుత్వ పెన్షన్
- భార్య, తనకు వృద్ధాప్య పింఛన్
- రికవరీకి లోకాయుక్త ఆదేశం



అనంతపురం క్రైం, సెప్టెంబరు 16: అన్ని అర్హతలున్నా పింఛన్ రాక కొందరు అల్లాడిపోతుంటే మరి కొందరు మాత్రం అధికారులను బురిడీ కొట్టించి రెండు, మూడు పింఛన్లు కాజేస్తున్నారు. అలాంటి ఉదంతమే ఓ రిటైర్డ్ వీఆర్ఓది. ఈయన రిటైర్డ్ వీఆర్ఓగా ప్రభుత్వం నుంచి పెన్షన్ అందుకుంటూనే తనకు, తన భార్యకు సామాజిక పింఛన్లు ఇప్పించుకుంటున్నాడు. దీనిపై ఓ వ్యక్తి లోకాయుక్తకు ఫిర్యాదు చేయడంతో వాస్తవాలు బహిర్గతమయ్యా యి. దీంతో తీసుకున్న పింఛన్ సొమ్ము రికవరీకి లోకాయుక్త ఆదేశాలిచ్చింది. నార్పల మండలం వెంకటాంపల్లికి చెందిన సోంపల్లి చిన్నప్పయ్య 1997లో వీఆర్వోగా రిటైర్డ్ అయ్యారు. అప్పటి నుంచి ప్రభుత్వం ద్వారా పెన్షన్ పొందుతున్నారు. ఇది చాలదన్నట్లు తన తెలివితేటలతో తనకు, తన భార్యకు వృద్ధాప్య పింఛన్ వచ్చేలా చేసుకున్నాడు. అలా 2008 నుంచి 2020 వరకు వృద్ధాప్య పింఛన్ పొందాడు. తన భార్య రమణమ్మ 2011 ఆగస్టు నుంచి 2020 అక్టోబరు వరకు పింఛన్ పొందింది. 2020లో భార్యకు పింఛన్ వస్తోందనే కారణంతో చిన్నప్పయ్యకు నిలిపివేశారు. కాగా ఆయన భార్య రమణమ్మకు కూడా భూమి ఎక్కువుందనే కారణంతో పింఛన్ నిలిపివేశారు. ఈ విషయాలపై అదే గ్రామానికి చెందిన శ్రీహరికుమార్ ఈ ఏడాది జూన్‌లో లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారించిన లోకాయుక్త పింఛన్ మొత్తం రికవరీ చేయాలని ఇటీవలే ఆదేశాలిచ్చింది. ఆ మేరకు డీఆర్‌డీఏ అధికారుల ఆదేశాల మేరకు రూ.93550లు చెల్లించాలంటూ చిన్నప్పయ్యకు నార్పల ఎంపీడీఓ నోటీసులు జారీ చేశారు.

ఘనంగా మిలాద్-ఉన్-నబి

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 16: మహమ్మద్ ప్రవక్త పుట్టిన రోజును పురస్కరించుకుని సోమవారం మిలాద్-ఉన్-నబి వేడుకలను జిల్లావ్యాప్తంగా ముస్లింలు జరుపుకున్నారు. ప్రతి మసీదు, మదరసా, దర్గాలనుంచి ముస్లింలు జెండాలు చేతబూని నినాదాలు చేస్తూ ర్యాలీలు నిర్వహించారు. మహమ్మద్ ప్రవక్త బోధనలను అనుసరించి సమాజ శ్రేయస్సుకు ప్రతిఒక్కరూ పాటుపడాలని ఈసందర్భంగా మతపెద్దలు పిలుపునిచ్చారు. సాయంత్రం దర్గాలు, మసీదులలో మహమ్మద్ ప్రవక్త పవిత్ర కేశ దర్శనం నిర్వహించారు.



నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

తీజ్ ఉత్సవాలు ప్రారంభం


సంప్రదాయ వేషధారణలో లంబాడీ మహిళలు

ఉరవకొండ, సెప్టెంబరు16: బంజారాల తీజ్ ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వజ్రకరూరు మండలంలోని వెంకటాంపల్లి పెద్ద తండాలో గురునానక్ ఆలయం వద్ద ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. బంజారా యువతులు సంప్రదాయ వేషధారణలో గోధుమలు తెచ్చేందుకు బయలుదేరారు. అనంతరం వెదురు బుట్టలో పుట్టమన్ను, ఇసుకను సమకూర్చుకుని గోధుమ విత్తనాలను నాటారు. 11 రోజుల పాటు వాటికి భక్తిశ్రద్ధలతో నీటిని పోస్తారు.

నెలవారీ ఉద్యోగోన్నతులు ఇవ్వాలి: ఏపీటీఎఫ్


మాట్లాడుతున్న సిరాజుద్దీన్

అనంతపురం విద్య, సెప్టెంబరు 16: ఉపాధ్యాయులకు నెలవారీ ఉద్యోగోన్నతులు ఇవ్వాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాయల్ వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి సిరాజుద్దీన్ డిమాండ్ చేశారు. సోమవారం ఆ సంఘం జోనల్ కార్యదర్శి సతీష్‌కుమార్ అధ్యక్షతన ఉపాధ్యాయభవన్‌లో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రెండేళ్లుగా నెలవారీ ఉద్యోగోన్నతులు ఇవ్వకపోవడంతో వేలాది ఖాళీలు అలాగే ఉన్నాయన్నారు. మండల స్థాయిలో జరగాల్సిన పని సర్దుబాటు ప్రక్రియను రాష్ట్రస్థాయి అధికారులు ఆధ్వర్యంలో చేయడం వల్ల చాలా మంది ఉపాధ్యాయులు ఆందోళన పడ్డారన్నారు. ఈ ప్రక్రియ పూర్తిగా అసంబద్ధమైందన్నారు. సర్దుబాటు 8 కిలోమీటర్ల లోపు ఉండాలన్న నిబంధనలను పక్కనబెట్టేసి డివిజన్ పేరుతో సుదూర ప్రాంతాలకు టీచర్లను సర్దుబాటు చేయడంతో అవస్థలు పడుతున్నారని తెలిపారు. జిల్లా గౌరవ సలహాదారులు వెంకటేశులు, ఉపాధ్యక్షులు బొమ్మయ్య, సతీష్, సర్దార్‌వలి పాల్గొన్నారు.

జీఆర్పీ డీఎస్పీ బదిలీ

గుంతకల్లు, సెప్టెంబరు16: రైల్వే పోలీస్(జీఆర్పీ) డీఎస్పీ షేక్ అబ్దుల్ అజీజ్ గుంటూరు జిల్లాకు బదిలీ అయ్యారు. జీఆర్పీ డీఎస్పీగా పనిచేస్తున్న షేక్ అబ్దుల్ అజీజ్‌ను ప్రభుత్వం గుంటూరు ఈస్ట్ సబ్ డివిజన్‌కు బదిలీ చేసింది. మంగళవారం ఆయన గుంతకల్లులో రిలీవ్ కానున్నారు.

రేపు మూడు అన్న క్యాంటీన్లు ప్రారంభం

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 16: నగరంలో ఈనెల 18న మూడు అన్న క్యాంటీన్లను ప్రారంభిస్తున్నట్లు ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాతూరు గుత్తి రోడ్డులోని అన్న క్యాంటీన్‌తోపాటు రైల్వే స్టేషన్ సమీపంలో, బళ్లారి బైపాస్‌లోని అన్న క్యాంటీన్లను ప్రారంభిస్తామన్నారు. ఇప్పటికే క్యాంటీన్లకు సంబంధించిన అన్ని పనులు పూర్తయ్యాయన్నారు. పట్టణ ప్రాంతంలోని పేద ప్రజలకు ఆకలి తీర్చేడమే అన్న క్యాంటీన్ల ఉద్దేశ్యమని పేర్కొన్నారు. రాబోవు రోజుల్లో అవసరమైన ప్రాంతాల్లో అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేస్తామన్నారు.

జీడిపల్లికి 1001 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, సెప్టెంబరు 16: మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు సోమవారం కృష్ణాజలాల ఇన్‌ఫ్లో 1001 క్యూసెక్కుల వస్తోందని హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ ఫేజ్-2కు 921 క్యూసెక్కులు, పీఏబీఆర్‌కు మరువ నుంచి 50 క్యూసెక్కులు వెళుతున్నట్లు అధికారులు వెల్లడించారు.

జాతీయ పోటీలకు ఎంపిక


ఎంపికైన జిల్లా క్రీడాకారులు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 16: జాతీయ టెన్నికాయిట్ పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈనెల 14నుంచి 16వతేదీ వరకు శ్రీకాకుళంలో నిర్వహించిన 36వ రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ సబ్‌జూనియర్స్ పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. వీరిలో ప్రతిభ కనబరిచిన మహీధర్, జ్యోతిక, దీక్షిత, స్పందన ఈనెల 28వతేదీ నుంచి జమ్మూ కాశ్మీర్‌లో జరిగే జాతీయ పోటీలకు ఎంపికైనట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రజాక్, రంగస్వామి తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను అసోసియేషన్ సభ్యులు చెన్నయ్య, పీడీలు వలీ, అమరాంజనేయులు, నాగరాజు, ప్రకాష్ అభినందించారు.

చెస్ టోర్నీలో ఉదయ్‌కుమార్ ప్రతిభ



కేంద్రమంత్రి నుంచి బహుమతి అందుకుంటున్న ఉదయ్‌కుమార్ నాయుడు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 16: ఇంటర్నేషనల్ ఫిడే చెస్ రేటింగ్ టోర్నీలో జిల్లా సీనియర్ క్రీడాకారుడు ఉదయ్‌కుమార్ ప్రతిభను చాటాడు. భీమవరంలో ఆదివారం ఆంధ్రాచెస్ అసోసియేషన్, ఆల్ ఇండియా చెస్ ఫెడరేషన్, వరల్డ్ చెస్ ఫెడరేషన్ సంయుక్తంగా నిర్వహించిన ఇంటర్నేషనల్ బిలో 1600 ఫిడే రేటింగ్ చెస్ టోర్నమెంట్-2024లో సుమారు మూడు దేశాలతో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి 500 మంది క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించారు. ఇందులో జిల్లాకు చెందిన సీనియర్ చెస్ క్రీడాకారుడు ఉదయ్‌కుమార్‌నాయుడు ఫైనల్లో విజేతగా నిలిచి ఓపెన్ క్యాటగిరిలో 14వ స్థానాన్ని సాధించాడు. కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ, ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు చేతుల మీదుగా రూ.10వేలు నగదుతో పాటు మెమెంటో అందుకున్నాడు. ఆల్ అనంతపూర్ చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు శివకుమార్, గౌరవాధ్యక్షుడు బాలరాజు, కోశాధికారి కిశోర్‌నాయుడు అభినందనలు తెలిపారు.

అయినా.. వదలరు..!

నష్టాలు వస్తున్నా పెరుగుతున్న టమోటా సాగు
రూ. లక్షలు పెట్టుబడి పెడుతున్న అన్నదాతలు
ప్రభుత్వ రాయితీల కోసం ఎదురుచూపు


కట్టెల పద్ధతిలో సాగు చేసిన టమోటా

అనంతపురంరూరల్, సెప్టెంబరు 16: దిగుబడి బాగున్నా ధర లేక వరుసగా నష్టాలు వస్తున్నా రైతులు మాత్రం టమోటా సాగును వీడటం లేదు. ఏడాదిలో ఒక్కసారి సరైన రేటు తగిలితే చాలు మొత్తం కష్టాలు తీరుతాయన్న ఆశతో ప్రతిసారి సాగు చేస్తూనే ఉన్నారు. ఈక్రమంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా టమోటా సాగు ఏటేటా పెరుగుతూనే ఉంది. పంటసాగుకు ప్రభుత్వం నుంచి సాయం అందితే కాస్త ఊరట ఉంటుందని పలువురు రైతులు అభిప్రాయపడుతున్నారు.

వివిధ పద్ధతుల్లో సాగు

ఉమ్మడి జిల్లాలోని రైతులు వివిధ పద్ధతుల్లో టమోటా సాగు చేస్తున్నారు. సాధారణ పద్ధతిలో పంట సాగు చేస్తే వర్షాలకు దెబ్బతింటోందని మల్చింగ్ షీట్, కట్టెల పద్ధతిలో సాగు చేస్తున్నారు. ఈ పద్ధతుల్లో పంట సాగు చేస్తే వర్షాలకు కాయలు దెబ్బతినకపోవడంతో పాటు నిల్వ కూడా సాధారణం కంటే రెండు మూడు రోజులు అధికంగా ఉంటుందని రైతులు చెబుతున్నారు. మల్చింగ్ పద్ధతిలో పంట కాలం ముగిసినా అదనంగా నెల..కట్టెల పద్ధతిలో రెండు నెలల పాటు దిగుబడులు వచ్చే వీలుంటుందని చెబు తున్నారు. అందుకే ఈపద్ధతుల్లో పంట సాగుకు రైతులు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. అయితే పెట్టుబడులు కూడా రూ.లక్షల్లోనే అవుతున్నాయి. మల్చింగ్ (పేపర్)పద్ధతిలో ఎకరానికి రూ.50వేల నుంచి రూ.70వేల మధ్య పెట్టుబడి అవుతున్నట్లు రైతులు చెబుతున్నారు. మల్చింగ్ తరువాత ఎక్కువగా సాగు చేస్తున్నది కట్టెల పద్ధతి. ఈ పద్ధతిలో పంట సాగుకు ఎకరాకు రూ.లక్ష ఖర్చు అవుతున్నట్లు రైతులు చెబుతున్నారు. గతంలో టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో మల్చింగ్, కట్టెల పద్ధతిలో సాగుకు రాయితీలు ఇచ్చే వారని, వైసీపీ పాలనలో వీటన్నింటిని ఎత్తివేసినట్లు రైతులు చెబుతున్నారు. వీటిని పునరుద్ధరిస్తే రైతుకు మేలు జరుగుతుందని వారు పేర్కొంటున్నారు.

ఉపాధికి అనుసంధానించాలి

ఇరవై ఎకరాల్లో టమోటా సాగు చేశా. మల్చింగ్ పద్ధతిలో 15ఎకరాలు, కట్టెల పద్ధతిలో ఐదు ఎకరాల్లో టమోటా సాగు చేశా. కట్టెల విధానంలో పంట కోత కొచ్చే దశలో ఉంది. ఈ పద్ధతి సాగు చేయడానికి ఎకరానికి రూ.80వేలకు పైగా పెట్టుబడి పెట్టా. పంట సాగు చేసినప్పటి నుంచి ఇప్పటివరకు 12సార్లు పురుగు మందులు కొట్టా. ఇప్పటికే ఐదు ఎకరాలకు రూ.5లక్షలు పెట్టుబడి పెట్టా. ప్రస్తుతం ఎరువుల ధరలు పెరిగిపోయాయి. ఈ పంటను ఉపాధి హామీ పథకానికి అనుసంధానం చేస్తే రైతులకు మేలు జరుగుతుంది. ఎరువుల ధరలు తగ్గిస్తే కూడా కొంత వరకు రైతులకు మేలు జరుగుతుంది.


వెంకటరాముడు, రైతు, ఆలమూరు

■ రాయితీలు ఇస్తే బాగుంటుంది


మల్చింగ్ పద్ధతిలో పంట సాగు చేశా. పంటసాగు మొదలుకొని కోత కొచ్చే సరికి ఎకరానికి రూ.60వేలకుపైగానే పెట్టుబడులు అయ్యాయి. మూడున్నర ఎకరాల్లో పంట సాగు చేశా. పేపర్ రోల్లు, వాటిని పరిచేందుకే రూ.12 వేల వరకు ఎకరానికి ఖర్చు అయింది. ఇలా అన్ని అయ్యేసరికి పెట్టు బడులకే రూ.60వేలకు చేరుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం రాయితీలిస్తే బాగుంటుంది. టీడీపీ పాలనలో మల్చింగ్ పద్ధతిలో సాగుకు హెక్టార్‌కు రూ.10వేల నుంచి రూ.15వేలు సబ్సిడీ వచ్చేది.

-సంజీవులు, రైతు, ఆలమూరు

■ ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

కనీస మద్దతు ధరతో టమోటాను ప్రభుత్వమే కొనుగోలు చేస్తే రైతులకు లాభం చేకూరుతుంది. టమోటా ఆధారిత పరిశ్రమలు నెలకొల్పాలి. 90శాతం రాయితీతో స్టేకింగ్ (కట్టెల)పద్ధతి సాగుకు అవకాశం కల్పించాలి. నేల మీద సాగుకు పేపర్ షీట్ అందించాలి. టమోటా మార్కెట్‌లో మండీల పర్యవేక్షణ ప్రభుత్వమే చేయాలి. టమోటా ప్రాసెసింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలి. మండీల్లో హమాలీ కూలీ, బాక్స్‌ల బాడుగ మండీల నిర్వాహకులే ఇచ్చేవిధంగా చూడాలి.


- చిరుతల మల్లికార్జున, జిల్లాప్రధాన కార్యదర్శి, రైతు సంఘం

■ మార్కెట్ ఏర్పాటు చేయాలి

ప్రభుత్వ ఆధ్వర్యంలో టమోటా మార్కెట్ ఏర్పాటు చేయాలి. ఉద్యాన శాఖ, మార్కెటింగ్ శాఖ సమన్వయంతో టమోటా రైతుకు గిట్టుబాటు ధర వచ్చే విధంగా చర్యలు తీసుకోవడంతోపాటు రైతులకు అవగాహన కల్పించాలి. గతంలో మాదిరిగానే ఉద్యాన శాఖ ద్వారా టమోటా విత్తనాలు అందించాలి. ప్రతి నియోజకవర్గంలో కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు చేయాలి. జ్యూస్ తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసి, అందుబాటులోకి తీసుకురావాలి. పెట్టుబడుల ఖర్చులు తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. టమోటా కనీసం వారంరోజులు నిల్వ ఉండేవిధంగా నూతన వంగడాలు అందుబాటులోకి తీసుకురావాలి.


- చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఏపీ రైతు సంఘం

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి

● మంత్రులు సత్యకుమార్, సవిత


మాట్లాడుతున్న మంత్రి సవిత

పుట్టపర్తిరూరల్, సెప్టెంబరు 16: జర్నలిస్టులు ప్రభుత్వానికి ప్రజలకు వారధులని, వారి సంక్షేమం కోసం కృషి చేస్తామని రాష్ట్ర మంత్రులు సత్యకుమార్, సవిత పేర్కొన్నారు. జిల్లాకేంద్రం లోని సాయిఆరామంలో సోమవారం ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రులతో పాటు ఎంపీ పార్థసారధి, మడకశిర ఎమ్మెల్యే రాజు, మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి హాజరై ప్రసంగించారు. మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ జర్నలిస్టులు ప్రజల పక్షాన పోరాడాలని తెలిపారు. అర్హత కలిగిన ప్రతిజర్నలిస్టుకు అక్రిడిటేషన్ ఇస్తామన్నారు. హెల్త్‌కార్డులకు సంబంధించి సమాచార పౌర సంబంధాలశాఖ మంత్రి, ఆరోగ్యశ్రీ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహి స్తామన్నారు. పత్రికారంగంలో జవాబుదారి తనం ఉండాలన్నారు. ఏమాత్రం చిత్తశుద్ధి లేని జగన్ తన పాలనా కాలంలో వైద్య కళాశాల నిర్మాణాలను 25శాతం కూడా పూర్తి చేయలేదని ఎద్దేవా చేశారు. ఏపీలో 17 వైద్య కళాశాల నిర్మాణాలలో హడావుడి తప్ప చేసిందేమి లేదన్నారు. ఫేజ్-2లో మదనపల్లి, ఆదోని, మార్కాపురం, పులివెందుల, పాడేరు వైద్యకళాశాలలను ప్రారంభించి పనుల పూర్తి చేయకపోవడంతో రాష్ట్రంలోని వైద్య విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. జాతీయ వైద్యకమిషన్ బృందం జూన్ 24న కళాశాలను తనిఖీచేసి కళాశాల పనుల పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిందన్నారు. అసుపత్రుల నిర్మాణంలో మౌలిక వసతులు పెండింగ్‌లో ఉండటంపై అభ్యంతరం వ్యక్తం చేసింద న్నారు. నియామకాలు కూడా చేపట్టక పోవడంతో పులివెందులలో కూడా మెడికల్ కాలేజీలో బోధనా నసిబ్బంది కొరత ఉందని తెలిపారు. వైద్యకళాశాలకు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు, జగన్‌ప్రభుత్వం వాటికి ఖర్చుచేసిన నిధులపై తాను బహిరంగ చర్చకు సిద్ధమని, నీవు నీమంది మార్బలంతో చర్చకు రావాలని సవాల్ చేశారు. మరో మంత్రి సవిత మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజల కోసం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికి తెలిసేలా జర్నలిస్టులు కృషి చేయాలన్నా రు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధితో పాటు లోటుపాట్లను కూడా తెలియచేయాలన్నారు. మడకశిర ఎమ్మెల్యే రాజు మాట్లాడుతూ గతప్రభుత్వం పాలనలో పలుచోట్ల జర్నలిస్టులపై దాడులు జరిగాయని, ఈప్రభుత్వంలో జర్నలిస్టుల రక్షణకు అన్నివిధాలా బాధ్యత తీసుకుంటామన్నారు. మాజీమంత్రి పల్లె మాట్లాడుతూ జర్నలిస్టులు సమాజాభివృద్ధి కోసం పాటుపడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జర్నలిస్టు యూనియన్ ప్రతినిధులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

తుంగభద్ర గేట్లు మార్చాలి: సీపీఐ

ఉరవకొండ, సెప్టెంబరు 16: శిథిలావస్థకు చేరుకున్న తుంగభద్ర డ్యాం గేట్లన్నీ మార్చాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ డిమాండ్ చేశారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తుంగభద్ర డ్యాంకు సంబంధించి గేట్లు మార్చాలని కేంద్ర జలసంఘం మాజీ చైర్మన్ ఏకే బజాజ్ నేతృత్వంలో కమిటీ కూడా ఇదే విషయాన్ని బోర్డుకు స్పష్టం చేసిందని తెలిపారు. ఏ డ్యాం గేట్లు అయిన 45 సంవత్సరాలు మాత్రమే పనిచేస్తాయన్నారు. తుంగభద్ర డ్యాం గేట్లు 70ఏళ్లుగా పనిచేస్తున్నాయని, తుప్పుపట్టినప్పుడు దాన్ని తొలగించి రంగులు వేస్తుండడం వల్ల వాటి మందం తగ్గిందని తద్వారా బలహీనంగా మారాయన్నారు. దీంతో 19వ గేటు కొట్టుకుపోయిందని తెల్పిచెప్పారన్నారు. డ్యాం భద్రత దృష్ట్యా 33గేట్లు మార్చి వాటి స్థానంలో కొత్త గేట్లు అమర్చాలని ఇందుకు సంబంధించి సమగ్రనివేదిక సీడబ్ల్యూసీకి ఏకే బజాజ్ అందించారన్నారు. 33 గేట్లు ఏర్పాటు చేయాలంటే రూ.264 కోట్లు వ్యయం అవుతుందని నిపుణులు అంచనా వేశారని తెలిపారు. గేటు ఎత్తడానికి, దించడానికి వీలుగా హైడ్రాలిక్ అయిష్ట్ వంటి ఆధునాతన వ్యవస్థ ఏర్పాటు చేయాలంటే అదనంగా మరో వంద కోట్లు వ్యయం అవుతుందన్నారు. ఈనెల 19న జరిగే ఐఏబీ సమావేశంలో చర్చించాలన్నారు. ఈసమావేశాన్ని తూతూమంత్రంగా కాకుండా ప్రజాప్రతినిధులు, అధికారులు పారదర్శకంగా చర్చలు జరపాలనానరు. మల్లికార్జున, సుల్తాన్, మల్లేష్, తిప్పయ్య పాల్గొన్నారు.

అప్పులబాధతో రైతు ఆత్మహత్య


రాజశేఖర్ (ఫైల్)

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు16: మండలంలోని చింతలాంపల్లికి చెందిన రైతు రాజశేఖర్(34) అప్పుల బాధ భరించలేక ఆదివారం అర్ధరాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. రాజశేఖర్ తనకున్న నాలుగెకరాల్లో వ్యవసాయం చేసుకుంటుండేవాడు. ప్రస్తుతం మరో 28 ఎకరాలు కౌలుకు తీసుకుని వేరుశనగ తదితర పంటలు సాగు చేశాడు. పెట్టుబడి కోసం రూ.17.50 లక్షలు అప్పు చేశాడు. వర్షాభావ పరిస్థితుల కారణంగా పంట చేతికి దక్కే పరిస్థితి కనిపించట్లేదు. ఈ నేపథ్యంలో అప్పులు ఎలా తీర్చాలోనని ఆవేదన చెందుతుండేవాడు. తీవ్ర మనస్తాపం చెందిన అతడు ఆదివారం అర్ధరాత్రి ఇంట్లో వారందరూ నిద్రలో ఉండగా.. పురుగుల మందు తాగాడు. ఆ అలికిడికి మేల్కొన్న కుటుంబీకులు అతడిని వెంటనే గుంతకల్లు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే రాజశేఖర్ మరణించినట్లు వైద్యులు తెలిపారు. రైతుకు భార్య గీత, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆత్మహత్యపై గుంతకల్లు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

కార్మికుల సమ్మెబాట..

నీటి కోసం జనం వెంపర్లాట..!

- శ్రీరామిరెడ్డి, సత్యసాయి పథకాల బంద్‌తో నీటి కష్టాలు
- పొలాల వద్దకు వెళుతున్న గ్రామీణులు
- వేసవిని తలపిస్తున్న ఎండలు
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో అధికారులు విఫలం


పీఏబీఆర్ వద్ద బంద్ చేసిన తాగునీటి శుద్ధి కేంద్రం

కూడేరు, సెప్టెంబరు 16: ఉమ్మడి జిల్లాకు తాగునీరు అందించే శ్రీరామిరెడ్డి, సత్యసాయి శుద్ధి కేంద్రాలు బంద్ కావడంతో గ్రామాల్లో ప్రజలు దాహంతో అల్లాడిపోతున్నారు. నీటి పథకంలో పనిచేస్తున్న కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని 11 రోజులుగా సమ్మెబాట పట్టడంతో గ్రామాల్లో తాగునీటి కష్టాలు తీవ్రమయ్యాయి. ఉమ్మడి జిల్లాల్లో శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కింద దాదాపు 1100 గ్రామాలు, సత్యసాయి తాగునీటి పథకం కింద 1050 గ్రామాలకు నీటి సరఫరా జరిగేది. ఆ రెండు పథకాల్లో పనిచేసే కార్మికులు సమ్మెబాట పట్టడంతో గ్రామాల్లో తాగునీరు దొరక్క అల్లాడిపోతున్నారు. కూడేరు మండలంలో కొర్రకోడు, చోళసముద్రం, నారాయణపురం, జల్లిపల్లి, ముద్దలాపురం, కూడేరు తదితర గ్రామాల్లో తాగునీటి కష్టాలు తీవ్రంగా ఉన్నాయి. శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం నుంచి ఉరవకొండ నియోజక వర్గ తాగునీటి పథకానికి సరఫరా చేస్తున్నారు. శ్రీరామిరెడ్డి తాగునీటి కార్మికులు సమ్మెలోకి వెళ్లడంతో ఆ ప్రాజెక్టు కూడా నిలిచిపోయింది. దీంతో ఉరవకొండ నియోజక వర్గ పరిధిలోని గ్రామాలకు కూడా తాగునీటి కష్టాలు తప్పలేదు. పంచాయతీ నుంచి సరఫరా అయ్యే నీరు కరెంటు వచ్చినప్పుడే పట్టుకోవాలని.. అవి ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి నెలకొందని పలు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. వ్యవసాయ మోటర్లకు కరెంటు వచ్చిన సమయంలో సుదూరంగా ఉన్న తోటలకు వద్దకు వెళ్లి నీరు తెచ్చుకుని దాహం తీర్చుకుంటున్నారు. ప్రజలతోపాటు మూగ జీవాలు కూడా దాహంతో అల్లాడిపోతున్నాయి. తాగునీటి కోసం పనులు వదులుకొని ఇళ్ల వద్ద పడిగాపులు కాస్తున్నట్లు మహిళలు తెలిపారు. మూగ జీవాల దాహం తీర్చడానికి కిలోమీటర్ల దూరంలోనున్న తోటల్లోకి ఎద్దుల బండ్లు, ద్విచక్రవాహనాలు, సైకిళ్లపై వెళ్లి తీసుకువస్తున్నారు. వికలాంగులు, వృద్ధులు పడుతున్న కష్టాలు వర్ణణాతీతం. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి కష్టాలను తీర్చడానికి అధికారులు ఎలాంటి ప్రత్యామ్నాయాలు చేయకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు వర్షాకాలం వచ్చినా వేసవి కాలాన్ని తలపించేలా ఎండలు మండిపోతున్నాయి. దీంతో నీటి అవసరాలు మరింత ఎక్కువయ్యాయి.


ఎద్దులబండి, సైకిల్‌పై నీటిని తెచ్చుకుంటున్న ముద్దలాపురం గ్రామస్తులు

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


సత్యసాయి, శ్రీరామిరెడ్డి తాగునీటి కార్మికుల సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి. 12 రోజులుగా వేలాధి మంది కార్మికులు వేతనాలు, పీఎఫ్ తదితర సమస్యలపై ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

-శ్రీనివాసులు, సీఐటీయూ నాయకుడు

క్యాన్సర్ ఆసుపత్రి మంజూరు చేయండి

● మంత్రి సత్యకుమార్‌కు ఎమ్మెల్యే పరిటాల సునీత విజ్ఞప్తి

అనంతపురంరూరల్, సెప్టెంబరు 16: ఉమ్మడి జిల్లాలో ఇటీవల క్యాన్సర్ బాధితుల ఎక్కువగా కనిపిస్తున్నారని, వారి కోసం ప్రత్యేకంగా క్యాన్సర్ ఆసుపత్రిని మంజూరు చేయాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌కు రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత విజ్ఞప్తి చేశారు. సోమవారం మండలంలో పర్యటించిన మంత్రిని ఎమ్మెల్యే కలిశారు. మంత్రి దృష్టికి పలు విషయాలను తీసుకెళ్లారు. జిల్లాకు చెందిన క్యాన్సర్ బాధితులు చికిత్స కోసం మెట్రో నగరాలకు వెళ్తున్నారని, వైద్యానికి చాలా ఖర్చు చేస్తున్నారని తెలిపారు. అదే విధంగా చిన్నపిల్లలకు మెరుగైన వైద్యం కోసం మెట్రో నగరాలకు వెళ్తున్నారని, ఇందుకు సరైన పరికరాలున్న అంబులెన్స్‌లు లేక ఇబ్బంది పడుతున్నారని మంత్రి దృష్టికి తెచ్చారు. ప్రభుత్వమే అంబులెన్స్ సౌకర్యం కల్పించాలని మంత్రిని కోరారు.

టమోటా కిలో రూ.35



అనంతపురంరూరల్, సెప్టెంబరు 16: స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.35తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. సోమవారం 2,250 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.28, కనిష్ఠ ధర రూ.20పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ టన్ను రూ.18వేలు



అనంతపురంరూరల్, సెప్టెంబరు 16: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.18వేలు, కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి రూ.15వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపికశ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 26 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

పర్యాటక అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 16: పర్యాటక అవార్డుల కోసం 2023-24 సంవత్సరానికి సంబంధించి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా పర్యాటకశాఖాధికారి కమతం విజయకుమార్‌బాబు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పర్యాటక సంబంధిత 38 రకాల విభాగాల్లో 41 అవార్డులు అందజేయనున్నట్లు తెలిపారు. www.aptourism.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు ఫారంను డౌన్‌లోడ్ చేసుకుని, పూర్తి చేసిన దరఖాస్తులను ఏపీ టూరిజం అథారిటీ, 5వ ఫ్లోర్, స్టాలిన్ కార్పొరేట్ బిల్డింగ్, ఆటోనగర్, విజయవాడ చిరునామాకు ఈనెల 22వ తేదీలోపు పంపాలన్నారు.

ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా గౌని పాతిరెడ్డి



అనంతపురం విద్య, సెప్టెంబరు 16: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్(ఏపీటీఎఫ్) రాష్ట్ర కార్యదర్శిగా గౌని పాతిరెడ్డిని ఆ సంఘం రాష్ట్ర నాయకులు నియమించారు. సోమవారం ఆయనకు ఆ యూనియన్, రాష్ట్ర, జిల్లా నాయకులు అభినందనలు తెలిపారు. కళ్యాణదుర్గం మండలం హుల్లికల్లు ప్రాథమిక పాఠశాలలో సెకెండరీ గ్రేడ్ టీచర్‌గా పనిచేస్తున్న గౌనిపాతిరెడ్డిని ఆదివారం విజయవాడలో జరిగిన ఎన్నికల్లో రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గతంలో నాలుగేళ్ల బెలుగుప్ప మండల అధ్యక్షుడిగా పనిచేశానని, మూడోసారి రాష్ట్ర కౌన్సిలర్‌గా పనిచేస్తున్న తనపై రాష్ట్ర నాయకత్వం మరింత బాధ్యతలు పెంచిందన్నారు. ఉపాధ్యాయులకు చేసిన సేవలను గుర్తిస్తూ రాష్ట్ర కమిటీ తనకు ఈ బాధ్యతలు అప్పగించడం ఆనందంగా ఉందన్నారు.

ఓనం వేడుకలు



ప్రత్యేక అలంకరణలో అయ్యప్పస్వామి మూలవిరాట్

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 16 : కేరళీయుల నూతన సంవత్సరాది ఓనం వేడుకలను సోమవారం మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయం ఆవరణలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో వైభవోపేతంగా నిర్వహించారు. ఉదయం గణపతిపూజతో వేడుకలను ప్రారంభించారు. అనంతరం అయ్యప్పస్వామికి భస్మాభిషేకం, ఫలపంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహా మంగళహారతి అన్నదాన వినియోగం చేశారు. ఆలయ ఈఓ సాకే రమేష్‌బాబు, అనువంశీకుడు హోసూరు రామసుబ్రహ్మణ్యం, ప్రధానార్చకుడు నరసింహశాస్త్రి, పరమేష్, భక్తులు పాల్గొన్నారు.

ఈ క్రాప్ బుకింగ్ చేయించుకోండి: ఏఓ

గార్లదిన్నె, సెప్టెంబరు 16 : మండలంలో పంటలు సాగుచేసిన రైతులు 2024-25 ఏడాది ఖరీఫ్‌కు సంబంధించి తప్పక ఈ క్రాప్ బుకింగ్ చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి సోమశేఖర్ సోమవారం పేర్కొన్నారు. ఇప్పటివరకు 7384 మంది రైతులు 28వేల ఎకరాలకు ఈ క్రాప్ బుకింగ్ చేసుకున్నారన్నారు. అలాగే 3855మంది రైతులు ఈకేవైసీ చేసుకున్నారని, ఇంకా 3863మంది ఈకేవైసీ చేసుకోవాల్సి ఉందన్నారు. రైతు సేవా కేంద్రాల్లో ఉదయం 8 గంటల నుంచే ఈకేవైసీ చేసుకోవాలని కోరారు. ఈ కేవైసీ చేసుకుంటేనే ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్ వర్తిస్తాయని ఆయన తెలిపారు.

నేడు వ్యాయామ విద్యపై సమావేశం

రామగిరి, సెప్టెంబరు 16: మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం స్కూల్ కాంప్లెక్స్ వ్యాయామ విద్యపై సమావేశం నిర్వహిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్, మండల కో ఆర్డినేటర్, పీడీ కోటప్ప సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి రామగిరి, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి మండలాలకు చెందిన పీడీలు తప్పక హాజరు కావాలన్నారు. ఈనెల 13వ తేదీన జరిగిన మండలస్థాయి క్రీడాపోటీలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు.

రోడ్లపై జంతు సంచారం అరికట్టాలని వినతి

అనంతపురం క్రైం, సెప్టెంబరు 16: నగరంలో ఆవులు, కుక్కలు పందులు విపరీతంగా సంచరిస్తున్నాయని, దానిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని అడ్వకేట్ల సంక్షేమ సంఘం సభ్యులు.. నగర పాలక సంస్థ కమిషనర్ పీవీవీఎస్ మూర్తిని కోరారు. ఈ మేరకు సొసైటీ అధ్యక్షుడు, న్యాయవాది హనుమన్న, అజీజ్ సోమవారం కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అవులు రోడ్లపై సంచరిస్తూ ట్రాఫిక్ ప్రమాదాలకు కారణమవుతున్నాయన్నారు. వీధికుక్కలు పిల్లలను, వృద్ధులను కరచి ఇబ్బందులకు గురిచేస్తున్నాయన్నారు. రోగాలు వ్యాప్తి చెందేందుకు పందుల సంచారం దోహదం చేస్తోందని వివరించారు. కావున వాటి సంచారంపై చర్యలు తీసుకోవాలని కోరారు.

కట్నం వేధింపులు భరించలేక ఆత్మహత్య

అనంతపురం క్రైం, సెప్టెంబరు 16: కట్నం వేధింపులు తాళలేక ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. నగరంలోని నాలుగో రోడ్డుకు చెందిన లాకే అనితకు అదే కాలనీలో నివాసముంటున్న లాకే బాలాజీతో ఐదేళ్ల క్రితం వివాహమైంది. పెళ్లి సమయంలో కట్నకానుకల కింద 10 తులాల బంగారం, ఐదు సెంట్ల స్థలాన్ని అతడికి ఇచ్చారు. వారికి కుమారుడు ప్రత్యూష్, కుమార్తె దీక్షిత సంతానం. పెళ్లయిన రెండేళ్ల నుంచి భర్త బాలాజీ, అత్త హైమావతి, మామ పెద్దముని అదనపు కట్నం కోసం అనితను వేధింపులకు గురి చేయడం మొదలు పెట్టారు. వేధింపులు భరించలేక ఆమె మనస్తాపానికి గురైంది. సమీప బంధువు మృతి చెందడంతో కుటుంబసభ్యులు మూడో రోడ్డుకు వెళ్లడంతో అని సోమవారం ఉదయం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుందని త్రీటౌన్ సీఐ శాంతి లాల్ తెలిపారు. మృతురాలి తల్లి నాగమ్మ ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దాడి కేసు నమోదు

అనంతపురం క్రైం, సెప్టెంబరు 16 : పలువురిపై దాడి చేసిన ఘటనపై అనంతపురం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. అనంతపురం రూరల్ మండలం కురుగుంట వైఎస్సార్ కాలనీకి చెందిన అబ్దుల్ రహీం తన తల్లిదండ్రులు శర్మాస్‌వలి, జైనబ్బీతో కలిసి ఉంటున్నాడు. అతడి తల్లికి మానసిక స్థితి సరిగా లేదు. దీంతో పాటు దారిలో వెళ్లే అందరిపై కేకలు వేస్తూ గొడవకు దిగేది. ఈ క్రమంలో ఈ నెల 15వతేదీ అలా అరుస్తూ ఉంటే కుటుంబసభ్యులు ఆమెను లోపలికి తీసుకెళ్లి చేతులు కట్టివేశారు. విషయం తెలుసుకున్న మేనమామ ఇమాం గుంతకల్లుకు చెందిన నలుగురిని పిలుచుకొచ్చి కుటుంబసభ్యులపై దాడి చేశాడు. ఈ ఘటనపై సోమవారం రహీం ఫిర్యాదు చేయగా కేసునమోదు చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

ఇద్దరి అరెస్టు

అనంతపురం క్రైం: నగరంలోని రాయల్‌నగర్‌లో ఉన్న వాటర్ ప్లాంట్‌లో వాటర్‌బాటిళ్లపై అచ్చులు వేసే యంత్రాన్ని ఎత్తుకెళ్లారని ఇద్దరు బాలురను నాలుగో పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆయుధం కలిగి ఉన్నాడని ఓ యువకుడిని నాలుగో పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

ఆరుగురిపై కేసు నమోదు

గార్లదిన్నె, సెప్టెంబరు 16 : మండలంలోని మర్తాడు గ్రామానికి చెందిన ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ వేణు తెలిపారు. మర్తాడు గ్రామంలో చందు అనే యువకుడిపై ఆదివారం రాత్రి అదే గ్రామానికి చెందిన ధర్మతేజతోపాటు మరో ఐదుగురు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారన్నారు. తీవ్రంగా గాయపడిన చందును అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ దాడికి పాల్పడిన ధర్మతేజతో పాటు ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ వేణు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి

పుట్టపర్తిరూరల్, సెప్టెంబరు 16 : మండలంలోని వీరజిన్నయ్యపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓడీసీకి చెందిన డ్రైవర్ అశోక్ కుమార్ (23) మరణించాడు. సోమవారం సాయంత్రం అతను రైతుల ట్రాన్స్‌ఫార్మర్లు పుట్టపర్తిలో రిపేరు చేయించుకుని బొలెరో వాహనంలో వాటిని తీసుకొని ఓడీసీకి బయలుదేరాడు. వీరాంజనేయపల్లి సమీపంలో వెంగళమ్మచెరువు నుంచి ఎదురుగా వచ్చిన లారీని తప్పించబోయి బొలెరో వాహనం అదుపుతప్పి చెట్టుకు ఢీ కొన్నాడు. ఈ ఘటనలో డ్రైవర్ అశోక్ అక్కడికక్కడే మరణించాడు. బొలెరో వాహనంలో ప్రయాణిస్తున్న తిరుపాల్ తీవ్రంగా.. సునీల్‌కుమార్, రామకృష్ణ స్వల్పంగా.. గాయపడ్డారు. వారిని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాద స్థలాన్ని రూరల్ ఎస్ఐ కృష్ణమూర్తి పరిశీలించారు. కేసు నమోదు చేసుకున్నారు. అశోక్ మృతదేహాన్ని పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అశోక్‌కు భార్య , సంవత్సరం వయస్సు గల కుమార్తె ఉన్నారు.

వరుస చోరీలతో బెంబేలు

రాత్రిళ్లు భయాందోళనలో నార్పల వాసులు



ఓబయ్య ఇంట్లోని బీరువాను తెరిచిన దుండగులు (ఫైల్)

నార్పల, సెప్టెంబరు 16: వ్యాపార పరంగా దినదినాభివృద్ధి చెందుతున్న మండలకేంద్ర మైన నార్పలలో వరుస దొంగతనాలు ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. రోజూ రాత్రైతే చాలు ఎవరి ఇంట్లో దొంగలు చొరబడుతారో అనే భయం వారిలో నెలకొంది. కేవలం ఒకటిన్నర నెల వ్యవధిలోనే పెద్ద పెద్ద దొంగతనాలు జర గడంతో మండలకేంద్రం వాసులు నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. ఇతర జిల్లాల నుంచి వచ్చి ఇక్కడ దొంగతనాలు చేస్తున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు. అయినా పోలీసులు ఏ మాత్రం పట్టించుకోవడంలేదనే విమర్శలు వినపడుతున్నాయి. ఇప్పటికే దొంగతనాల కేసులు పదుల సంఖ్యలో నమోదయ్యాయి. కొన్ని చోరీల విషయంలో ఆ ఇళ్లలో ఏమీ దొరకక దొంగలు వెనుదిరి గిన సంఘటనలు ఉన్నాయి. అలాంటివి సంఘటనల్లో దొంగలు సీసీ కెమెరాల్లో రికార్డు అయినా పోలీసులు వారిని ఏమి చేయలేక మౌనం దాల్చడంపై అంతర్యం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. పోలీసులు దొంగలను పట్టుకోకుండా ఇళ్లకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఉచిత సలహాలు ఇస్తున్నారని బాధితులు వాపోతున్నారు. చాలా మంది బాధితుల్లో పిల్లల పెళ్లిళ్ల కోసం, ఆరోగ్యం బాగాలేదని తెచ్చి పెట్టుకున్న బంగారం నగలు, నగదును దోచుకెళ్లారని బాధితుల ద్వారా తెలుస్తోంది.

నెలన్నర వ్యవధిలో..

కేవలం ఒకటిన్నర నెలలోనే నార్పలలో జరిగిన చోరీలకు సంబంధించి పోలీసులకు అందిన ఫిర్యాదుల మేరకు వివరాలు ఇలా ఉన్నాయి నార్పలకు చెందిన చిలమకూరి శివశంకర్ ఇంట్లో నాలుగు తులాల బంగారం, రూ.1.60లక్షలు ఎత్తుకెళ్లారు. గురుప్రసాద్ ఇంట్లో రెండు తులాల బంగారం, రూ. 90వేలు, కత్తెర వెంకటరాముడు ఇంట్లో రూ.2.45లక్షలు, 5తులాల బంగారం ఎత్తుకెళ్లారు. అలాగే ఓబయ్య ఇంట్లో 20తులాల బంగారం, రూ. 60వేలు ఎత్తుకెళ్లారు. గందోడి నాగేంద్ర ఇంట్లో రూ.1.45లక్షలు, ఐదున్నర తులాల బంగారం, పులసల నూతల రాముడు ఇంట్లో ఆరు తులాల బంగారం, రూ.లక్ష చోరీ చేశారు. అలాగే నార్పలలోనే దాదాపు 15నుంచి 20 వరకు దొంగతనాలు జరిగినా వాటిపై పోలీసులు కేసు నమోదు చేయకుండా వదిలేసినట్లు సమాచారం.

నూతన సీఐ, ఎస్ఐకి సవాల్

బాధితులు పోలీసులకు చేసిన ఫిర్యాదుల ప్రకారం... నార్పలలో ఇప్పటి వరకు జరిగిన చోరీల్లో పలు ఇళ్లలో 43తులాల బంగారం, రూ.8లక్షలు దొంగలు ఎత్తు కెళ్లారు. వారం క్రితం శింగనమల సీఐగా కౌలుట్లయ్య, నార్పల మండలం ఎస్ఐగా సాగర్ బాధ్యతలు చేప ట్టారు. నార్పలలోని ఉద్దిబావి చేను కాలనీలో 15 రోజుల క్రితం పులసలనూతల రాముడు ఇంట్లో ఆరు తులాల బంగారం, రూ.లక్ష ఎత్తుకెళ్లిన దొంగలు నూతన సీఐ, ఎస్ఐలకు సవాల్ విసిరారు. ఇప్పటి వరకు చోరీ కేసుల్లో పురోగతి సాధించలేదని ప్రజలు చర్చించుకుంటున్నారు.

సంతలో 60కిపైగా సెల్‌ఫోన్లు మాయం

మండల కేంద్రమైన నార్పలలో ప్రతి శనివారం కూరగాయాల సంత నిర్వహిస్తారు. ఈ సంతకు 36గ్రామాలకు చెందిన వారు వస్తారు. ఇదే అదునుగా భావించిన గుర్తుతెలియని వ్యక్తులు మార్కెట్‌లో చొరబడి మహిళలు, వృద్ధుల వద్ద నుంచి దాదాపు 60కి పైగా సెల్ ఫోన్ చోరీలు జరిగినా, పోలీసులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. ఇదే క్రమంలో పది రోజుల క్రితం విజయవాడకు చెందిన ఓ యువకుడు, కర్నూలుకు చెందిన మరో యువకుడు సెల్‌ఫోన్ చోరీ చేస్తుండగా స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పజెప్పారు. వారిని పోలీసులు వదిలేసినట్లు సమాచారం. ఇప్పటికైనా ఉన్నతస్థాయి అధికారులు స్పందించి చోరీ కేసులను చేదించడంతో పాటు దొంగతనాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

19నుంచి ఎస్‌జీఎఫ్... నియోజకవర్గస్థాయి క్రీడాపోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 16: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) అనంతపురం అర్బన్ నియోజకవర్గం స్థాయి క్రీడాపోటీలు ఈనెల 19వ తేదీ నుంచి 25వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి సుగుణమ్మ తెలిపారు. ఆమె సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఇలా తెలిపారు. అండర్-14, అండర్-17 బాలురకు, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడా పోటీలను ఈ నెల 19వ తేదీన, బాలికలకు 20వతేదీన అశోక్‌నగర్‌లోని ఇండోర్‌స్టేడియంలో నిర్వహిస్తామన్నారు. అలాగే 21న అండర్-14, 17 బాల, బాలికలకు షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ఉంటాయని, అదేరోజు యోగా పోటీలు జరుగుతాయన్నారు. చెస్ పోటీలను 24వ తేదీన నిర్వహిస్తామని తెలిపారు. న్యూటౌన్ బాలుర జూనియర్ కళాశాలలో 25న అథ్లెటిక్ పోటీలు బాల, బాలికలకు ఉంటాయని తెలిపారు. ఆసక్తి, అర్హత గల క్రీడాకారులు జననధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, యూనిఫాంతో హాజరుకావాలని కోరారు. మరిన్ని వివరాలకు సెల్ ఫోన్ నంబర్లు 9949222024, 8919602389లను సంప్రదించాలని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి తెలిపారు.

ఉపాధ్యాయుల చొరవ

రోడ్డుకు ఇరువైపులా కంపచెట్ల తొలగింపు

అనంతపురంరూరల్, సెప్టెంబరు 16: మండలంలోని మన్నీల-చిగిచెర్ల రోడ్డు పక్కనున్న ముళ్ల కంపలను తొలగించేందుకు గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులు చల్లా ఆదినారాయణ, ప్రతాప్‌రెడ్డి సోమవారం చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మన్నీల గ్రామం నుంచి చిగిచెర్ల వరకు ఏడు కిలో మీటర్ల పొడవునా రోడ్డుకు ఇరువైపులా ముళ్లకంపలు ఏపుగా పెరిగి రాకపోకలకు ఇబ్బందులు కలిగించేవని వారు తెలిపారు. దీంతో తమ సొంత సొమ్ము రూ. 20వేలు వెచ్చించి ఎక్స్‌కవేటర్ సాయంతో తొలగిస్తున్నామన్నారు. గ్రామస్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తారురోడ్డు నిర్మాణం చేస్తే బాగుంటుందన్నారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

బొమ్మనహాళ్, సెప్టెంబరు 16: నంద్యాల జిల్లా ఆళ్లగడ్డకు చెందిన విజయకుమార్(52) అనే వ్యక్తి గత శనివారం బొమ్మనహాళ్ మండలం ఉంతకల్లు గ్రామ సమీపంలో ఉన్న హెచ్చెల్సీలోకి స్నానం కోసం వెళ్లి గల్లంతైన విషయం తెలిసిందే. అతను సోమవారం మధ్యాహ్నం కణేకల్లు మండలం గెణిగెర గ్రామ సమీపాన కాలవలో శవమై కనిపించాడు. మృతదేహాన్ని బొమ్మనహాళ్ పోలీసులు బయటకు తీయించి కణేకల్లు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహింపజేశారు. మృతుడి కుమారుడు మదన్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ నబీరసూల్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గుత్తిరూరల్, సెప్టెంబరు 16: మండలంలోని కరిడికొండ గ్రామ శివారులోని 44వ జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. కె ఊబిచెర్ల గ్రామానికి చెందిన హనుమేష్, వెంకటరాముడు గుత్తికి బైక్‌లో వెళ్లి కొద్దిసేపటి అనంతరం స్వగ్రామానికి బయలుదేరారు. కరిడికొండ శివారులో బైక్ అదుపు తప్పి బోల్తా పడింది. ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తర్వాత మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

లారీ ఢీకొని ముగ్గురికి..

తాడిపత్రి, సెప్టెంబరు 16: పట్టణ సమీపంలోని వరహాలుతోట వద్ద సోమవారం గుర్తుతెలియని లారీ ఢీకొని పట్టణానికి చెందిన లోకేష్, సాధిక్, ఫయాజ్ గాయపడ్డారని రూరల్ ఎస్ఐ కాటయ్య తెలిపారు. లోకేష్, సాధిక్, ఫయాజ్ ద్విచక్రవాహనంలో మండలంలోని హాజీవలి దర్గాకు వెళుతుండగా వరహాలు తోటవద్ద లారీ ఢీకొంది. దీంతో ముగ్గురు గాయపడ్డారు. చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సాధిక్, ఫయాజ్‌లను మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

హిందూపురం (పరిగి), సెప్టెంబరు 16: మండలంలోని ఊటకూరు దళిత కాలనీకి చెందిన మూగమ్మగారి అంజినమ్మ(56) ఆదివారం రాత్రి విద్యుదాఘాతంతో మృతిచెందింది. పశువుల పాక నుంచి బాత్రూమ్‌కు విద్యుత్ లైను తీసుకోవడంతో సిల్కువైరు తెగి ఇనుపకడ్డీ మీద పడింది. ఆమె మనవడు ఈశ్వర్ ఆ కడ్డీని తాకి షాక్‌కొట్టి అరవడంతో అక్కడే ఉన్న అంజినమ్మ, మనవడిని కాపాడే క్రమంలో కరెంటు షాక్ కొట్టి స్పృహ కోల్పోయింది. ఆమెను హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు ఏఎస్ఐ జయలలిత తెలిపారు.

ఘనంగా మంత్రి జన్మదిన వేడుకలు



చైతన్య కిషోర్ ఆధ్వర్యంలో కేక్‌ను కట్‌చేస్తున్న మంత్రి సత్యకుమార్

అనంతపురం సెంట్రల్, సెప్టెంబరు 16: బీజేపీ నాయకుడు చైతన్య కిషోర్ ఆధ్వర్యంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు అధ్యక్షతన నగరంలోని కళ్యాణదుర్గం రోడ్డులో ఏర్పాటు చేసిన వేడుకల్లో మంత్రి కేక్‌ను కట్‌చేసి, సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు ప్రదీప్, నాయకులు రాము, మురళి, రత్నమయ్య, రామకృష్ణ పాల్గొన్నారు. అదేవిధంగా ఎమ్మార్పీఎస్ అక్కులప్ప ఆధ్వర్యంలో పలువురు మంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రం చుట్టూ పిచ్చిమొక్కలు

తొలగించాలంటున్న తల్లిదండ్రులు



అంగన్‌వాడీ కేంద్రం వద్ద పెరిగిన గడ్డి, పిచ్చిమొక్కలు

శింగనమల, సెప్టెంబరు 16: మండలంలోని చిన్న జలాలపురం అంగన్ వాడీ కేంద్రం వద్ద పెరిగిన గడ్డిని, పిచ్చిమొక్కలను తొలగించాలని పిల్లలు తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. గ్రామానికి చెందిన రెండు అంగన్‌వాడీ కేంద్రాలను ఒక భవనంలో నిర్వహిస్తున్నారు. ఆ కేంద్రాలకు మూడేళ్ల నుంచి ఐదేళ్ల వయస్సు ఉన్న పిల్లలు 30 మంది వస్తారు. ఇటీవల కురిసిన వర్షాలకు భవనం చుట్టూ గడ్డి, పిచ్చి చెట్లు విపరీతంగా పెరిగాయి. దీంతో అక్కడ పాములు తదితర విషపురుగులు ఎక్కువగా సంచరిస్తున్నాయని పిల్లలను పంపేందుకు తల్లిదండ్రులు భయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవచూపి వెంటనే అంగన్‌వాడీ కేంద్రం చుట్టూ గడ్డి, కంప చెట్లు తొలగించాలని వారు కోరుతున్నారు.

పది తులాల బంగారం చోరీ

తాడిపత్రి, సెప్టెంబరు16: పట్టణంలోని గాంధీనగర్‌లో నివాసముంటున్న నాగరాజు ఇంట్లో పట్టపగలే గుర్తుతెలియని దుండగులు బంగారం చోరీ చేశారని పట్టణ పోలీసులు తెలిపారు. నాగరాజు అర్జాస్‌స్టీల్ ప్లాంట్‌లో కార్మికునిగా పనిచేస్తున్నాడు. మధ్యాహ్న సమయంలో పనినిమిత్తం నాగరాజు బయటకు వెళ్లగా ఆ సమయంలో ఇంటిలో ఎవరూ లేకపోవడంతో అదును చూసిన దొంగలు చొరబడ్డారు. బీరువాలో ఉన్న 10తులాల బంగారాన్ని ఎత్తుకెళ్లారు. ఇంటికి వచ్చిన నాగరాజు దొంగతనం జరిగినట్లు గుర్తించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. సంఘటనా స్థలాన్ని ఏఎస్ఐ నాగన్న పరిశీలించారు. బాధితున్ని ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండువర్గాల ఘర్షణ

తాడిపత్రి, సెప్టెంబరు16: పట్టణంలోని సుంకులమ్మపాలెంకు చెందిన వినయ్, గన్నెవారిపల్లికి చెందిన కుళ్లాయప్ప సోమవారం ఘర్షణ పడ్డారని పట్టణ పోలీసులు తెలిపారు. వినయ్, కుళ్లాయప్ప గతంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేవారు. లావాదేవీల్లో తేడాలు రావడంతో ఇరువురి మధ్య మాటమాట పెరిగింది. దీంతో ఇరువురికి చెందిన పలువురు ఘర్షణ పడ్డారు. ఈ ఘర్షణలో కుళ్లాయప్ప, వినయ్ గాయపడ్డారు. ఇరువురి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు తెలిపారు.

వినాయక నిమజ్జనానికి నీటి కష్టాలు

● నీరులేని కాలువలో విగ్రహాలను వదిలేసిన వైనం



నిమజ్జనం చేయకుండా విగ్రహాలను హెచ్చెల్సీలో వదిలేసిన దృశ్యం

నార్పల, సెప్టెంబరు16: ఒకవైపు రైతులు హెచ్చెల్సీకి నీరు ఎప్పుడు వదులుతారా అని ఎదురుచూస్తున్నారు. అదలా ఉంచితే... ఆ నీరు రాకపోవడంతో వినాయక చవితి సందర్భంగా మూడు రోజులు, ఐదు రోజుల పాటు పూజలు నిర్వహించిన మండల వాసులు వినాయక విగ్రహాల నిమజ్జనం హెచ్ఎల్‌సీలో అలాగే వదిలేశారు. మండల వ్యాప్తంగా వినాయక చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించిన ప్రజలకు వినాయకుడిని నిమజ్జనం చేయడానికి నీటి కరువు ఎదురైంది. వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా నిర్వహించినా సమీప కాలువ ల్లో కానీ, కుంటల్లో కానీ నీరు లేకపోవడం వల్ల నీటి ప్రవాహం లేని హెచ్ఎల్‌సీ వినాయక విగ్ర హాలను వదిలి రావడం చాలా బాధగా ఉందని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టులు నీటితో కళకళలాడుతున్నా ప్రభుత్వం హెచ్ఎల్‌సీకి నీరు వదలడం లేదన్నారు. కనీసం వర్షాలు పడినా కుంటల్లో , బావుల్లో నీరు ఉండేదని, ఇప్పటి వరకు నార్పల మండలంలో సరైన వర్షాలు కురవడంతో బోర్లలో కాస్తనీరు అడుగంటిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో నిమజ్జనానికి నీటి కొరత వల్ల విగ్రహాలను ఒట్టి కాలవల్లోనే వదిలేస్తున్నామని అంటున్నారు. పరమేశ్వరుడైనా కరువు నేలపై కనికరం చూపి గంగను వదలాలని దేవుడిని ప్రార్థిస్తున్నట్లు ప్రజలు అంటున్నారు.

ఘనంగా మిలాద్-ఉన్-నబీ



పాపంపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

అనంతపురం ప్రెస్‌క్లబ్, సెప్టెంబరు16 : నగరంలోని జమాతే ఇస్లామీ హింద్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మిలాద్-ఉన్-నబీ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ ఆర్గనైజేషన్ మహిళా అధ్యక్షురాలు అఖిల పర్వీన్ ఆధ్వర్యంలో రాజీవ్‌కాలనీలోని వృద్ధాశ్రమంలో పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్గనైజేషన్ అధ్యక్షుడు నవాజ్, కార్యదర్శి హాజీపీరా, మహిళా సభ్యులు భాను, సల్మా, మసురత్ తదితరులు పాల్గొన్నారు.

అనంతపురంరూరల్: మండలంలో మిలాద్-ఉన్-నబీ వేడుకలను ముస్లింలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం మసీదుల్లో ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. పాపంపేటలో కళ్యాణదుర్గం ప్రధానరోడ్డు వెంట నగరం వరకు ర్యాలీ చేశారు.

శింగనమల: మండలంలోని ముస్లింలు మిలాద్-ఉన్-నబీ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. శింగనమల అసర్‌కట్ట వద్ద నుంచి గంధోత్సవం చేపట్టారు. ముస్లిం పెద్దలు మాసూద్ వలి తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ



ఎమ్మెల్యే శ్రావణిశ్రీకి శుభాకాంక్షలు తెలుపుతున్న ముస్లిం మతపెద్దలు

శింగనమల, సెప్టెంబరు 16: మైనార్టీ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పేర్కొన్నారు. మిలాద్-ఉన్-నబీ సందర్భంగా నియోజకవర్గంలోని ముస్లింపెద్దలు సోమవారం అనంతపురంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి పెద్ద ఎత్తున తరలివెళ్లి ఆమెకు ఈద్ ముబారక్ తెలిపారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... రాష్ట్రంలో ముస్లింలకు కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని తెలిపారు.

జాతీయ తైక్వాండోలో నగర వాసి ప్రతిభ



యోగచర్వితను అభినందిస్తున్న కోచ్

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 16: జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో నగరానికి చెందిన యోగచర్విత అనే క్రీడాకారిణికి రజత పతకం దక్కింది. ఇటీవల ఆగ్రాలో నిర్వహించిన జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో యోగచర్విత 68కిలోల విభాగంలో పతకం సాధించింది. అలాగే సబ్ జూనియర్ విభాగంలో 22కేజీల కేటగిరీలో నందకృష్ణకు కాంస్య పతకం దక్కింది. విజేతలను కోచ్ రామాంజనేయులు అభినందించారు.

ఉపాధి పనుల్లో రూ.లక్షల్లో అవినీతి

- సిబ్బంది నిర్లక్ష్యంపై ఏపీడీ ఆగ్రహం
- శాఖాపరమైన చర్యలుంటాయని హెచ్చరిక




ప్రజావేదికలో టీఏలపై మండిపడుతున్న ఏపీడీ సుధాకర్‌రెడ్డి

బెళుగుప్ప, సెప్టెంబరు 16: మండలంలో జరిగిన ఉపాధి హామీ పథకం పనుల్లో రూ. లక్షల్లో అవినీతి చోటు చేసుకున్నట్లు సామాజిక తనిఖీల్లో తేలింది. స్థానిక ఎంపీడీఓ కార్యా లయంలో సోమవారం ఎంపీపీ పెద్దన్న అధ్యక్షతన 18వ సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఇందులో డ్వామా ఏపీడీ సుధాకర్‌రెడ్డి, ఎంపీడీఓ రామచంద్ర, ఎస్ఆర్‌పీ లక్ష్మీనారాయణ పాల్గొని విచారించారు. టెక్నికల్ అసిస్టెంట్లు పనులను పరిశీలించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఏపీడీ మండిపడ్డారు. శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలో పెద్ద ఎత్తున అవినీతి జరగడం ఇదే మొదటిసారని వాపోయారు. బెళుగుప్ప, దుద్దేకుంట గ్రామాల్లో పెద్దఎత్తున అవకతవకలు జరిగినట్లు వెలుగు చూసింది. ఈ గ్రామాల్లో మస్టర్లలో కులీల సంతకాలు ఫోర్జరీ చేసి చేశారు. బెళుగుప్పలో పనులు చేయకున్నా బిల్లులు డ్రా చేసినట్లు తేలింది. గృహనిర్మాణ శాఖలో 54 ఇళ్లు నిర్మించకుండానే బిల్లులు మంజూరయ్యాయి. తొమ్మిది మంది వలంటీర్లకు ఉపాధి బిల్లులు మంజూరు చేసినట్లు తేలింది. ఈ అవకతవకలపై ఏపీడీ ఆశ్చర్య పోయారు. ఇంత జరుగుతుంటే మీరంతా ఏమి చేస్తున్నారని సిబ్బందిని ప్రశ్నించారు. మండలంలోని 18 పంచాయతీల్లో గత యేడాదిలో ఈ పథకం కింద రూ. 7.32 కోట్ల వ్యయంతో ఉపాధి పనులు చేపట్టగా రూ. 60,87,769 అవినీతి జరిగినట్లు తనిఖీ బృం దం గుర్తించి ప్రజావేదికకు నివేదించారు. రూ. 17,23,358 రికవరీకి ఆదేశించారు. సిబ్బంది అలసత్వంతోనే ఇవన్నీ జరిగాయని.. వారికి రూ.1.04 లక్షల జరిమానా విధించారు. కార్యక్రమంలో ఏఈ సుధాకర్, కృష్ణ ప్రసాద్, టీడీపీ మండల కన్వీనర్ ప్రసాద్, నాయకులు పెద్ద తిప్పయ్య, మల్లికార్జున, ఈశ్వరప్ప తదితరులు పాల్గొన్నారు.

హెచ్చెల్సీ దుస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

● ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు



మాల్యం వద్ద కూలిన బ్రిడ్జిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలవ

కణేకల్లు, సెప్టెంబరు 16: హెచ్చెల్సీ పరిస్థితి అధ్వానంగా ఉందని, దీనిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. మండలంలోని మాల్యం గ్రామం వద్ద ఇటీవల కూలిన హెచ్చెల్సీ బ్రిడ్జిని ఎమ్మెల్యే సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ.. గత ఐదేళ్లలో హెచ్చెల్సీ మరమ్మతుల కోసం అప్పటి వైసీపీ ప్రభుత్వం ఒక్క పైసా కూడా విదల్చలేదన్నారు. అందుకే నేడు హెచ్చెల్సీ పరిస్థితి పూర్తి అధ్వానంగా మారిందన్నారు. ఇప్పటికే బిదురకుంతం వద్ద ఉన్న బ్రిడ్జి, కణేకల్లు వద్ద ఉన్న బ్రిడ్జి కుప్పకూలాయని, తాజాగా మాల్యం వద్ద ఉన్న బ్రిడ్జి కూడా కూలిపోవడం శోచనీయమని అన్నారు. అలాగే హెచ్చెల్సీ పరిస్థితి అధ్వానంగా ఉందన్నారు. ఈ సమస్యలన్నింటినీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్చెల్సీ డీఈ మద్దిలేటి, టీడీపీ నాయకులు లాలెప్ప, ఆనంద్‌రాజ్, బాయినేని నవీన్, కోకుర్తి సుదర్శన్, బీటీ రమేష్, చాంద్‌బాషా, మాబుసాబ్, కురుబ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


కణేకల్లులో వేడుకలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలవ


తాడిపత్రిలోని సిద్దిబాషా దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే జేసీ అశ్మిత్ రెడ్డి



గుంతకల్లులో ముస్లింల ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం


ఉరవకొండ: ర్యాలీలో పెద్దఎత్తున పాల్గొన్న ముస్లింలు

భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ

● పెద్దఎత్తున శాంతిర్యాలీలు, ప్రార్థనలు నిర్వహించిన ముస్లింలు

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: ముస్లింలు మిలాద్ ఉన్ నబీ వేడుకలను ముస్లింలు సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గుంతకల్లు, ఉరవకొండ, తాడిపత్రి, శింగనమల, కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల్లోని ప్రతి పట్టణాలు, మండలకేంద్రాలు, గ్రామాల్లో ముస్లింలు పండగను ఘనంగా జరిపారు. ఉదయన్నే అందరూ కలిసి మహమ్మద్ ప్రవక్త శాంతిబోధనలు తెలుపుతూ జెండాలు చేతపట్టి పురవీధుల్లో శాంతిర్యాలీ నిర్వహించారు. తర్వాత మసీదుల్లో, దర్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిపి ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. బంధుమిత్రులను ఇళ్లకు ఆహ్వానించి విందులు ఏర్పాటు చేశారు. కణేకల్లులో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మహమ్మద్ ప్రవక్త బోధనలు ఎందరికో ఆదర్శనమని అన్నారు. అనంతరం ర్యాలీలో పాల్గొన్నారు. తాడిపత్రి పట్టణంలోని సిద్ధిబాషా దర్గాలో ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. తర్వాత పండగ శుభాకాంక్షలు తెలిపారు. ఇక గుంతకల్లు పట్టణంలోని పోర్టర్‌లైన్‌లో గల దర్గాలో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ముస్లిం మత పెద్దలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అలాగే వారితో కలిసి ర్యాలీ నిర్వహించారు.


తాడిపత్రిలో..


పామిడిలో..


కళ్యాణదుర్గంలో..


రాయదుర్గంలో..

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

బొమ్మనహాళ్, సెప్టెంబరు 16: నంద్యాల జిల్లా ఆళ్లగడ్డకు చెందిన విజయకుమార్(52) అనే వ్యక్తి గత శనివారం బొమ్మనహాళ్ మండలం ఉంతకల్లు గ్రామ సమీపంలో ఉన్న హెచ్చెల్సీలోకి స్నానం కోసం వెళ్లి గల్లంతైన విషయం తెలిసిందే. అతను సోమవారం మధ్యాహ్నం కణేకల్లు మండలం గెణిగెర గ్రామ సమీపాన కాలవలో శవమై కనిపించాడు. మృతదేహాన్ని బొమ్మనహాళ్ పోలీసులు బయటకు తీయించి కణేకల్లు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహింపజేశారు. మృతుడి కుమారుడు మదన్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ నబీరసూల్ తెలిపారు.

బైక్ అదుపుతప్పి ఇద్దరికి గాయాలు

గుత్తిరూరల్, సెప్టెంబరు 16: మండలంలోని కరిడికొండ గ్రామ శివారులోని 44వ జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. కె.ఊబిచెర్ల గ్రామానికి చెందిన హనుమేష్, వెంకటరాముడు గుత్తికి బైక్‌లో వెళ్లి కొద్దిసేపటి అనంతరం తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు. కరిడికొండ గ్రామాశివారులోకి రాగానే బైక్ అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తర్వాత మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

లారీ ఢీకొని ముగ్గురికి..

తాడిపత్రి, సెప్టెంబరు 16: పట్టణ సమీపంలోని వరహాలుతోట వద్ద సోమవారం గుర్తుతెలియని లారీ ఢీకొనడంతో పట్టణానికి చెందిన లోకేష్, సాధిక్, ఫయాజ్ గాయపడ్డారని రూరల్ ఎస్ఐ కాటయ్య తెలిపారు. లోకేష్, సాధిక్, ఫయాజ్ ద్విచక్రవాహనంలో మండలంలోని హాజీవలి దర్గాకు వెళుతుండగా వరహాలు తోటవద్ద లారీ ఢీకొంది. దీంతో ముగ్గురూ గాయపడ్డారు. స్థానికులుల వారిని చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సాధిక్, ఫయాజ్‌ను మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు.

ఇరువర్గాల ఘర్షణ

తాడిపత్రి, సెప్టెంబరు 16: పట్టణంలోని సుంకులమ్మపాలెంకు చెందిన వినయ్, గన్నెవారిపల్లికి చెందిన కుళ్లాయప్ప సోమవారం ఘర్షణ పడ్డారని పట్టణ పోలీసులు తెలిపారు. వినయ్, కుళ్లాయప్ప గతంలో రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని చేసేవారు. లావాదేవీల్లో తేడాలు రావడంతో ఇరువురి మధ్య మాటమాట పెరిగింది. దీంతో ఇరువురికి చెందిన పలువురు ఘర్షణ పడ్డారు. ఈ ఘర్షణలో కుళ్లాయప్పతో పాటు వినయ్ గాయపడ్డారు. ఇరువురి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు చెప్పారు.

10తులాల బంగారం చోరీ

తాడిపత్రి, సెప్టెంబరు 16: పట్టణంలోని గాంధీనగర్‌లో గల నాగరాజు ఇంటిలోకి పట్టపగలే గుర్తుతెలియని దుండగులు చొరబడి బంగారం చోరీ చేశారని పట్టణ పోలీసులు తెలిపారు. నాగరాజు అర్జాస్‌స్టీల్ ప్లాంట్‌లో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. మధ్యాహ్న సమయంలో పనినిమిత్తం నాగరాజు బయటకు వెళ్లగా.. ఆ సమయంలో ఇంటిలో ఎవరూ లేకపోవడంతో అదును చూసిన దొంగలు చొరబడ్డారు. బీరువాలో ఉన్న 10తులాల బంగారాన్ని ఎత్తుకెళ్లారు. ఇంటికి వచ్చిన నాగరాజు చోరీ జరిగినట్లు గుర్తించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. సంఘటనా స్థలాన్ని ఏఎస్ఐ నాగన్న పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

కళ్యాణదుర్గంరూరల్, సెప్టెంబరు 16: పట్టణంలోని గాంధీచౌక్ వద్ద సోమవారం బీజేపీ శ్రేణులు పార్టీ సభ్యత్వ నమోదును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ ముప్పూరు దేవరాజ్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో కోటి సభ్యత్వాలను నమోదు చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. బీజేపీ బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు రామకృష్ణ, నాయకులు సుబ్రహ్మణ్యం, నరసింహమూర్తి యాదవ్, పట్టణ ప్రధాన కార్యదర్శి పవన్ కళ్యాణ్ యాదవ్, బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.

యువకుల దాతృత్వం

కళ్యాణదుర్గం, సెప్టెంబరు 16: మండలంలోని కుర్లపల్లికి చెందిన వృద్ధుడు నారాయణప్ప అనారోగ్యంతో బాధపడుతూ కుటుంబాన్ని పోషించలేక ఇబ్బంది పడుతున్నాడు. విషయాన్ని గమనించిన ఆ గ్రామానికి చెందిన పలువురు యువకులు మానవత్వంతో స్పందించారు. సోమవారం ఆ వృద్ధుడి కుటుంబానికి 6 నెలలకు సరిపడా బియ్యం, కిరాణా సరుకులు, బట్టలు అందజేశారు. వారు ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్ సుబ్బారావు, ఏటీఎల్ రామాంజనేయులు, ఉపాధ్యాయుడు చిరంజీవితో పాటు గ్రామ ప్రజలతో సరుకులను పోగుచేసి ఆ కుటుంబానికి అందజేశారు. అలాగే ఉపాధ్యాయుడు బద్దేనాయక్ రూ.5 వేల నగదును అందించారు.


వృద్ధుడికి సరుకులు అందజేస్తున్న యువకులు

సీతారాం ఏచూరి సేవలు ఆదర్శనీయం

● సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు


కళ్యాణదుర్గంలో నివాళులర్పిస్తున్న ఓబులు, కార్మికులు


ఉరవకొండలో నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

కళ్యాణదుర్గం, సెప్టెంబరు 16: సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి పేద ప్రజల అభ్యున్నతి కోసం చేసిన సేవలు ఆదర్శనీయమని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు కొనియాడారు. పట్టణంలో అంబేడ్కర్ విగ్రహం ఎదుట సోమ వారం ఆయన సీఐటీయూ నాయకులు, కార్మికులతో కలిసి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీతారాం ఏచూరి భౌతికంగా దూరమైనా ఆయన చేసిన సేవలు మాత్రం చిరస్థాయిగా నిలిచిపోయాయన్నారు. జీవిత కాలం పేద ప్రజల బాగు కోసం ఎనలేని పోరాటం చేసిన మహోన్నతుడిగా గుర్తింపు పొందారన్నారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అచ్యుత్ ప్రసాద్, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శకుంతల, శ్రీరామి రెడ్డి, సత్యసాయి కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరికి ఘన నివాళి

గుంతకల్లుటౌన్: పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచి జాతీయ స్థాయికి ఎదిగిన గొప్పనాయకుడు ఏచూరి అని కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు గోవిందు, నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, సహాయ కార్యదర్శి మహేష్, పట్టణ కార్యదర్శి గోపినాథ్, సహాయ కార్యదర్శి ఎస్ఎండీ గౌస్, నాయకులు పాల్గొన్నారు.

ఉరవకొండ: పట్టణంలో సీపీఎం నాయకులు సీతారాంఏచూరి సంతాప సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తర్వాత పలువురు మాట్లాడుతూ.. కార్మికులు, కర్షకులు, పేదలఅభ్యున్నతి కోసం అహర్నిశలు పోరాడిన వ్యక్తి ఏచూరి అని కొనియాడారు. రాజ్యసభ సభ్యుడిగా అనేక చట్టాలు తేవడానికి కృషిచేశారన్నారు. ఆయన మృతి పార్టీకే కాకుండా అన్ని వర్గాల ప్రజలకు తీరని లోటన్నారు. నాయకులు నల్లప్ప, మధుసూధన్, రంగారెడ్డి, జ్ఞానమూర్తి, శీనప్ప, వీరాంజనేయులు, విరుపాక్షి తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు సాయం

రాయదుర్గం రూరల్, సెప్టెంబరు 16: విజయవాడ వరదబాధితల సహాయార్థం పట్టణంలోని రెడీమేడ్ గార్మెంట్స్ అసోసియేషన్ సభ్యులు నగదును, దుస్తులను అందించారు. అసోసియేషన్ పట్టణ అధ్యక్షుడు టంకశాల హనుమంతు ఆధ్వర్యంలో సోమవారం సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు 84 మంది కలిసి ఎమ్మెల్యేకు వరద బాధితుల సహాయార్థం రూ. 3.20 లక్షల చెక్కును, రూ. 15 లక్షలు విలువ చేసే దుస్తులను అందజేశారు. ఇందుకు ఎమ్మెల్యే మాట్లాడుతూ గార్మెంట్స్ వ్యవస్థ కష్టాల్లో ఉన్నా.. సాటి మనుషులకు సాయం చేయడానికి రెడీమేడ్ గార్మెంట్స్ అసోసియేషన్ సభ్యులు ముందుకు రావడం అభినందనీయమన్నారు. టెక్స్‌టైల్స్ పార్క్ అభివృద్ధికి కలెక్టర్, బ్యాంకు అధికారులతో చర్చిస్తానని పేర్కొన్నారు. గార్మెంట్స్ పరిశ్రమ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో అసోషియేషన్ వైస్ ప్రెసిడెంట్ మురళీకృష్ణ, సెక్రెటరీ శ్రీనివాసులు ట్రెజరర్ వెంకటేశులు, సభ్యులు పాల్గొన్నారు.


కళ్యాణదుర్గంలో తరలింపునకు సిద్ధం చేసిన నూతన వస్త్రాలు

డీ.హీరేహాళ్: విజయవాడ వరదబాధితులను ఆదుకునేందుకు మండలంలోని మడేనహళ్లి గ్రామపంచాయతీకి చెందిన టీడీపీ నాయకులు రూ. 45 వేలు పోగు చేసి సోమవా రం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులుకు అందజేశారు. రాయదుర్గంలోని నివాసంలో వారు ఆయన్ను కలిసి నగదును అందించారు. నాయకులు హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గంరూరల్: విజయవాడ వరద బాధితులకు పట్టణంలోని బ్రాహ్మణ సేవా సంఘం వారు నూతన వస్త్రాలు పంపించారు. బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీవీ ప్రసాద్ రావు సూచన మేరకు వంద పంచెలు, 20 చీరలు, సిల్క్ దుస్తులను సోమవారం పంపించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాఘవేంద్ర రావు, కార్యదర్శి రామచంద్రరావు, ఉపాధ్యక్షుడు సతీష్ చంద్ర, గౌరవ సలహాదారులు గోపీనాథ్, సంఘం నాయకులు పాల్గొన్నారు.

20న జాబ్‌మేళా

రాయదుర్గంరూరల్, సెప్టెంబరు 16: పట్టణంలోని శాంతినగర్‌లో ఉన్న పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 20వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసులు సోమవారం ప్రకటనలో తెలిపారు. అమృత్‌రాజ్ గ్రూప్, రిలయన్స్, నిప్పో, ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంక్, వికాస్ అండ్ డీఎస్‌సీ సంస్థల వారు కార్యక్రమంలో పాల్గొనున్నట్లు చెప్పారు. ఆసక్తిగల నిరుద్యోగులు కళాశాలలో శుక్రవారం 10 గంటలకు హాజరు కావాలని ఆయన కోరారు.

నేటి నుంచి స్వచ్ఛతాహి సేవ

పుట్లూరు, సెప్టెంబరు16: మండలంలో మంగళవారం నుంచి అక్టోబరు 1వ తేదీ వరకు స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ యోగానందరెడ్డి సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రతి రోజూ పలు కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ముగ్గుల పోటీలు, పాటలు, ఆటల పోటీలు, జానపద నృత్యాలు, బుర్రకథలు, కోలాటం వంటి వాటిని జరుపుతామన్నారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, డ్రాయింగ్, క్విజ్ తదితర పోటీలు నిర్వహించి బహుమతులను అందజేస్తామని చెప్పారు. ఇవి నిర్వహిస్తూ స్వచ్ఛత పనులు చేపడతామని పేర్కొన్నారు.

స్వచ్ఛతాహి సేవలో పాల్గొనండి

బొమ్మనహాళ్: మండలవ్యాప్తంగా మంగళవారం జరిగే స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎంపీడీఓ షకీలాబేగం, ఈఓపీఆర్డీ దాస్ సోమవారం ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమంపై ర్యాలీలు నిర్వహించి స్వచ్ఛతపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. అక్టోబర్ ఒకటో తేదీ వరకు రోజూ పలు కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ప్రజలు భాగస్వాములై విజయవంతం చేయాలని కోరారు.

చెత్త నుంచి సంపద సృష్టి ఏదీ?

● మండలంలో నిరుపయోగంగా సంపద తయారీ కేంద్రాలు
● చెత్తను సేకరించి కాల్చేస్తున్న వైనం
● దీంతో మరింత పెరుగుతున్న వాయు కాలుష్యం
● స్వచ్ఛతాహి సేవ ప్రారంభానికి నేడు యాడికికి రానున్న కలెక్టర్


వేములపాడులో నిరుపయోగంగా ఉన్న సంపద తయారీ కేంద్రం

యాడికి, సెప్టెంబరు16: స్వచ్ఛభారత్‌లో భాగంగా మండలవ్యాప్తంగా నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో మండలంలోని 14గ్రామ పంచాయతీల్లో 14 చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను నిర్మించారు. వాటి నిర్మాణానికి ఒక్కోదానికి రూ.3 లక్షల నుంచి 5లక్షల వరకు వెచ్చించారు. ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం వచ్చింది. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలపై ఆ ప్రభుత్వం దృష్టి సారించకపోవడంతో నిరుపయోగంగా మారాయి. గ్రామ పంచాయతీ వాహనాల ద్వారా చెత్తసేకరణ జరుగుతున్నప్పటికీ అది చెత్తసేకరణ కేంద్రాల వద్దకు తీసుకువెళ్లడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. సేకరించిన చెత్తను గ్రామ శివారులో ఉన్న వంకల్లో వేసి కాలుస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. మండలంలోని 14చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల పరిస్థితి ఇలాగే ఉంది. ఏ ఒక్కటి కూడా గ్రామ పంచాయతీలకు సంపద సృష్టించడం లేదు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు సద్వినియోగమయ్యేలా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. దీనివలన నివాస గృహాల మధ్య ఉన్న చెత్త తొలగిపోయి స్వచ్ఛత నెలకొనడంతోపాటు గ్రామ పంచాయతీలకు ఆదాయం చేకూరుతుందని వారు అభిప్రాయపడుతున్నారు.

నేడు యాడికికి కలెక్టర్ రాక

యాడికిలో స్వచ్ఛతాహి సేవ కార్యక్రమం ప్రారంభానికి కలెక్టర్ వినోద్‌కుమార్ మంగళవారం రానున్నట్లు అధికారులు తెలిపారు. మం డలకేంద్రంలోని హైస్కూల్ నుంచి గాంధీ విగ్రహం వరకు స్వచ్ఛతాహి సేవపై అవగాహన ర్యాలీ నిర్వహించనున్నట్లు ఈఓపీఆర్డీ వెంకటేష్ సోమవారం తెలిపారు. బస్టాండ్‌లో మానవహారం నిర్వహించనున్నట్లు, కోనరోడ్డులో శ్రమదానం చేపట్టనున్నట్లు వివరించారు.


చెత్తను కాల్చి ఇలా పొగబెడుతున్నారు

చెత్తను కాల్చడంతో గాలికాలుష్యం పెరుగుతోంది..



నివాస గృహాల నుంచి సేకరించిన చెత్తను డంపింగ్ యార్డులకు తరలించకుండా కాలుస్తున్నారు. దీంతో గాలి కాలుష్యం పెరిగిపోతోంది. సేకరించిన చెత్తను కాల్చకుండా డంపింగ్‌యార్డుకు తరలించి సద్వినియోగమయ్యేలా చర్యలు చేపట్టాలి.

-విశ్వనాథ్, లియోక్లబ్, యాడికి

చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తెస్తాం..



మండలంలోని చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకువస్తాం. చెత్తను డంపింగ్‌యార్డులోకి తరలించేలా సిబ్బందికి కచ్చితమైన ఆదేశాలు ఇస్తాం. చెత్తకు నిప్పుపెట్టకుండా చర్యలు తీసుకుంటాం. చెత్తనుంచి సందప వచ్చేలా ప్రణాళికలు రూపొందిస్తాం.

-వెంకటేష్, ఈఓపీఆర్‌డీ, యాడికి

హెచ్చెల్సీ దుస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

● ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు


మాల్యం వద్ద కూలిన బ్రిడ్జిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలవ

కణేకల్లు, సెప్టెంబరు 16: హెచ్చెల్సీ పరిస్థితి తీవ్ర అధ్వానంగా ఉందని, ఈ దుస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. మండలంలోని మాల్యం గ్రామం వద్ద ఇటీవల కూలిన హెచ్చెల్సీ బ్రిడ్జిని ఎమ్మెల్యే సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత ఐదేళ్లలో హెచ్చెల్సీ మరమ్మతుల కోసం అప్పటి వైసీ పీ ప్రభుత్వం ఒక్క పైసా కూడా విదల్చలేదన్నారు. అందుకే నేడు హెచ్చెల్సీ పరిస్థితి పూర్తి అధ్వానంగా మారిందన్నారు. ఇప్పటికే బిదురకుంతం వద్ద ఉన్న బ్రిడ్జి , కణేకల్లు వద్ద ఉన్న బ్రిడ్జి కుప్ప కూలాయని, తాజాగా మాల్యం వద్ద ఉన్న బ్రిడ్జి కూడా కూలిపోవడం శోచనీయమని అన్నారు. అలాగే హెచ్చెల్సీ పరిస్థితి అధ్వానంగా ఉందన్నారు. ఈ సమస్యలన్నింటినీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్చెల్సీ డీఈ మద్దిలేటి, టీడీపీ నాయకులు లాలెప్ప, ఆనంద్‌రాజ్, బాయినేని నవీన్, కోకుర్తి సుదర్శన్, బీటీ రమేష్, చాంద్‌బాషా, మాబుసాబ్, కురుబ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా గణేశ్ నిమజ్జనం


ఊరేగింపుగా నిమజ్జనానికి తరలుతున్న గణేశుడు

పామిడి, సెప్టెంబరు 16 : వినాయక చవితి సందర్భంగా మండలంలోని గజరాంపల్లి గ్రామంలోని వ్యాలీ గ్రీన్ గార్మెంట్స్‌లో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహాన్ని పది రోజుల పూజల అనంతరం సోమవారం నిమజ్జనానికి తరలించారు. నిర్వాహకులు మండపంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేసి స్వామికి నైవేద్యాలు సమర్పించారు. అనంతరం మధ్యాహ్నం నుంచి అలంకరించి ప్రత్యేక వాహనంలో విగ్రహాన్ని ఉంచి ఊరేగింపుగా నిమజ్జనానికి తరలించారు. గార్మెంట్ వర్కర్లు, నిర్వాహకులు, పీజేఆర్ సోషల్ సర్వీస్ ట్రస్టు చైర్మన్ పెరుమాళ్ల జీవానందరెడ్డి ఊరేగింపులో పాల్గొన్నారు. భక్తిగీతాలు, డప్పు వాయిద్యాల నడుమ ఊరేగింపు సందడిగా సాగింది. తర్వాత పొగరూరు వద్ద చెరువులో నిమజ్జనం చేశారు.

మారెమ్మ జాతర ప్రారంభం


గంగాజలం తీసుకొస్తున్న భక్తులు

రాయదుర్గం రూరల్, సెప్టెంబరు 16: మండలంలోని ఉప్పరహాళ్ క్రాస్‌లో మారెమ్మ ఊరుదేవర వేడుకలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా నిర్వాహకులు ఉదయం ఉద్దేహాళ్ సమీపంలోని వేదావతిహగరిలో నుంచి గంగాజలాన్ని ఊరేగింపుగా తెచ్చి ఆలయంలోని అమ్మవారిని అభిషేకించి పూజలు చేశారు. భాద్రపదమాసంలో ఊరుదేవర వేడుకను జరపడం ఆనవాయితీగా వస్తోందని గ్రామస్థులు తెలిపారు. మంగళవారం అమ్మవారికి కుంభాల మహోత్సవాన్ని జరపనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.

రక్తదాన శిబిరం

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు16: మిలాద్ ఉన్ నబీ పండుగను పురస్కరించుకుని పట్టణంలోని రెడ్‌డ్రాప్ బ్లడ్ ఆర్గనైజేషన్ వారు సోమవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ప్రభుత్వ ఖాజీ అబ్దుల్‌రజాక్ పీర్ సాహెబ్ రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. మున్సిపల్ కార్యాలయం, మస్తాన్‌వలిదర్గా, టీబీ రోడ్డులో రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేశారు. వాటిల్లో 160 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో రెడ్‌డ్రాప్ బ్లడ్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు రెహమాన్, అధ్యక్షుడు గులాబ్ మహమ్మద్, ప్రధాన కార్యదర్శి షఫి, ఉపాధ్యక్షులు చింతదివాకర్, భగత్ తదితరులు పాల్గొన్నారు.

రికవరీతోనే సరిపెట్టారు..

బాధ్యులపై చర్యలు ఏవీ..?

ఉరవకొండ, సెప్టెంబరు 16: మండలంలోనే బూదగవి గ్రామంలో ఉపాధి హామీ పనులలో జరిగిన అక్రమాలపై అధికారులు రికవరీ మాత్రమే చేసి చేతులు దులుపుకున్నారు. బాధ్యులపై ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ఉపాధి హామీ పథకంలో అక్రమాలు జరగడంపై ఈ నెల రెండో తేదీన ఆంధ్రజ్యోతిలో ప్రత్యేక కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఇందుకు స్పందించిన ఉన్నతాధికారులు విచారణ అధికారిగా ఎంపీడీఓను నియమించారు. ఆయన ఈ నెల 5వతేదీన క్షేత్రస్థాయిలో విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిక అందజేశారు. కాగా విచారణ పూర్తయి వారం రోజులు గడుస్తున్నా.. అక్రమార్కులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. విచారణ అధికారి క్షేత్రస్థాయికి వెళ్లినప్పుడు అవినీతి అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. అయితే బాధ్యులపై చర్యలు తీసుకోవడంలో అధికారులు వెనుకంజ వేస్తున్నారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

● సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు డిమాండ్

కళ్యాణదుర్గం, సెప్టెంబరు 16: సత్యసాయి, శ్రీరామిరెడ్డి తాగునీటి పథకాల కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం త్వరితగతిన పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం తాగునీటి పథకాల కార్మికులు పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మె సోమవారం నాటికి 12వ రోజుకు చేరింది. ఈ సమ్మెకు ఓబులు మద్దతు తెలిపి మాట్లాడారు. సత్యసాయి, శ్రీరామిరెడ్డి తాగునీటి పథకాలకు ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడం దారుణమన్నారు. ఉమ్మడి జిల్లాకు ఏడాదికి రూ. 100 కోట్లు కూడా ఇవ్వలేని దుస్థితి ఏర్పడిందన్నారు. కార్మికులకు 7 నెలలుగా జీతాలు ఇవ్వకపోతే.. వారు కుటుంబాలను ఎలా పోషించుకుంటారని మండిపడ్డారు. 12 రోజులుగా కార్మికులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ డిమాండ్ మేరకు జిల్లా కేంద్రంలో మంగళవారం కార్మికులు, సీఐటీయూ నాయకులు కలిసి పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అచ్యుత్ ప్రసాద్, నాయకులు వన్నూరుస్వామి, వన్నూరప్ప, నరేష్, భవిత్, తులసి, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శకుంతల తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో రూ.లక్షల్లో అవినీతి

● సిబ్బంది నిర్లక్ష్యంపై ఏపీడీ ఆగ్రహం ● శాఖాపరమైన చర్యలుంటాయని హెచ్చరిక


ప్రజావేదికలో టీఏలపై మండిపడుతున్న ఏపీడీ

బెళుగుప్ప, సెప్టెంబరు 16: మండలంలో జరిగిన ఉపాధి హామీ పథక పనుల్లో రూ. లక్షల్లో అవినీతి చోటు చేసుకున్నట్లు సామాజిక తనిఖీల్లో తేలింది. మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ పెద్దన్న అధ్యక్షతన 18వ సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిం చారు. ఇందులో డ్వామా ఏపీడీ సుధాకర్‌రెడ్డి, ఎంపీడీఓ రామచంద్ర, ఎస్ఆర్‌పీ లక్ష్మీనారాయణ పాల్గొని విచారించారు. టెక్నికల్ అసిస్టెంట్లు పనులను పరిశీలించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఏపీడీ మండిపడ్డారు. శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలో పెద్ద ఎత్తున అవినీతి జరగడం ఇదే మొదటిసారని వాపోయారు. బెళుగుప్ప, దుద్దేకుంట గ్రామా ల్లో పెద్దఎత్తున అవకతవకలు జరిగినట్లు వెలుగు చూసింది. ఈ గ్రామాల్లో మస్టర్లలో కులీల సంతకాలు ఫోర్జరీ చేసి చేశారు. బెళుగుప్పలో పనులు చేయకున్నా బిల్లులు డ్రా చేసినట్లు తేలింది. గృహనిర్మాణ శాఖలో 54 ఇళ్లు నిర్మించకుండానే బిల్లులు మంజూరయ్యాయి. 9 మంది వలంటీర్లకు ఉపాధి బిల్లులు మంజూరు చేసినట్లు తేలింది. ఈ అవకతవకలపై ఏపీడీ ఆశ్చర్య పోయారు. ఇంత జరుగుతుంటే మీరంతా ఏమి చేస్తున్నట్లు అని సిబ్బందిని ప్రశ్నించారు. 18 పంచాయతీల్లో గత యేడాదిలో ఈ పథకం కింద రూ. 7.32 కోట్ల వ్యయంతో పనులు చేపట్టగా రూ. 60,87,769లు అవినీతి జరిగి నట్లు తనిఖీ బృందం గుర్తించి ప్రజావేదికకు నివేదించారు. 17,23,358ల రికవరీకి ఆదేశించారు. సిబ్బంది అలసత్వంతోనే ఇవన్నీ జరిగాయని.. వారికి రూ.1.04 లక్షల జరిమానా విధించారు. కార్యక్రమంలో ఏఈ సుధాకర్, కృష్ణ ప్రసాద్, టీడీపీ మండల కన్వీనర్ ప్రసాద్, నాయకులు పెద్ద తిప్పయ్య, మల్లికార్జున, ఈశ్వరప్ప తదితరులు పాల్గొన్నారు.